

నా ఎస్టీలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు.. అంటూ జగన్‌రెడ్డి పదేపదే పాడే పాట వెనుక నిజం ఏమిటో ఎన్నికల వేళ వెల్లడవుతోంది. ఉమ్మడి జిల్లా సిటింగ్‌ల్లో తన సొంత సామాజికవర్గానికి తప్ప ఇంకెవరికీ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు ఆయన. రాబోయే ఎన్నికల్లో సీట్లు లేవంటూ కొందరిని , అటునిటు మార్చి కొందరిని, ఏమీ తేల్చకుండా మరికొందరిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. జగన్‌రెడ్డి తీరుతో ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజిక వర్గాలు భగ్గుమంటున్నాయి. సొంత పార్టీలోనూ ఈ వర్గాలతో ఆయన రాజకీయ ఆటలు ఆడుకుంటున్నారు. - తిరుపతి,ఆంధ్రజ్యోతి




ఆట గద జగనా!

వైసీపీలో ఎస్సీ, బలిజ, ముస్లిం సిటింగ్‌ల సీట్లు మాత్రమే గల్లంతు

భద్రంగా రెడ్డి సామాజిక వర్గం

గురువారం రాత్రి విడుదల చేసిన వైసీపీ మూడవ జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా,తిరుపతి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలున్నాయి. ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యాలు తల్లకిందులయ్యాయి. గూడూరు, పూతలపట్టు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యేలు వరప్రసాదరావు, ఎంఎస్ బాబులకు టికెట్లు గల్లంతయ్యాయి. సత్యవేడు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సి వస్తోంది. అలాగే తిరుపతి ఎస్సీ సిటింగ్ ఎంపీ గురుమూర్తి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవాల్సి వస్తోంది. మదనపల్లె ముసిం సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైంది. చిత్తూరులో బలిజ సిటింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ సైతం గల్లంతైంది.

తగ్గి ఒంగినా.. పాపం బాబు!




2019లో అనూహ్యంగా పూతలపట్టు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఎంఎస్ బాబు, ఆ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రం బ్యాలెట్ బాక్సులో నీళ్ల పోసేసి గ్రామస్తుల దాడికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యేగా గెలిచినా ఆ అధికారాన్ని అనుభవించే అవకాశం వైసీపీలోని ఆధిపత్య కులానికి చెందిన మండల స్థాయి నాయకులు ఆయనకు దక్కకుండా ఇష్టానుసారం ఆడుకున్నారు. 2024లో తిరిగి టికెట్ దక్కించుకోవాలనే ఆశతోనే ఓపికగా అన్నీ భరించారు. ఇటీవల టికెట్ లేదనడంతో తీవ్ర మానసిక అశాంతితో కుంగిపోయారు. తన ఆవేదనను వెల్లడించారు. ఆ వెంటనే నాలుక కరచుకుని మాట మార్చారు. మంత్రి పెద్దిరెడ్డి పట్ల వినయాన్ని ప్రకటించారు. ఇదంతా టికెట్ మళ్లీ పొందాలనే తలొగ్గి చేశారు. అయినా చివరికి టికెట్ గల్లంతైంది. మాటా పోయి, మనసూ కలతచెంది మౌనంగా ఉన్నారు.

తలొగ్గక దెబ్బతిన్న నవాజ్‌బాషా



మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న బడా నేతకు లొంగలేదు. ఆ నేత అడుగులకు మడుగులొత్తలేదు. మరో మహిళా నేతను ఆశ్రయించి ఆమె ద్వారా అధిష్ఠానానికి చేరువై నేరుగా పనులు చేసుకుంటూ వచ్చారు. అదే ఆయన పాలిట శాపమైంది. వైసీపీ అధికార సామాజిక వర్గం బడా నేత కన్నెర్రతో ఈ మైనారిటీ నాయకుడికి తేలిగ్గా బై చెప్పేశారు.

పెనం నుంచి పొయ్యిలోకి ఆదిమూలం



సత్యవేడు సిటింగ్ ఎమ్మెల్యే పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది. ఆవిర్భావం నుంచీ కోనేటి ఆదిమూలం పార్టీలో వుంటూ 2014లో ఓడిపోయినా, 2019లో గెలిచారు. గెలుపు ఆనందం ఈ ఐదేళ్లలో ఆయనకు ఎన్నడూ దక్కలేదు.ముఖ్య నేతల వర్గాలు సొంత నియోజకవర్గంలో ఆయనకు స్వతంత్రత లేకుండా చేశాయి. ఆరోపణలు, నిందలతో ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. రెండు నెలలుగా టికెట్ దక్కదన్న ప్రచారం ఆయనకు, ఆయన కుటుంబానికి నరకం చూపింది. తీరా ఇప్పుడు సత్యవేడు లేదని, తిరుపతి ఎంపీ సీటిస్తామని తేల్చారు. ఇది ప్రమోషనో, డిమోషనో అర్థంకాని అయోమయంలో ఆయన పడిపోయారు. ఒక్క నియోజకవర్గంలోనే సతమతం అయిపోయిన ఆయనకు జిల్లా అంతా సమాళించుకోగల శక్తి సామర్థ్యాలు లేవు.

వరం దక్కని ప్రసాదు



గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు రిటైర్డు ఐఏఎస్ అధికారి. ఉద్యోగ విరమణ చేశాక వైసీపీలో చేరి 2014లో తిరుపతి నుంచీ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమన్నారు. మూటాముల్లె సర్దుకుని అక్కడకు వెళ్ళి పోటీ చేసి గెలిచారు. 2024లో ఈ స్థానభ్రంశమూ లేదు. మాజీ ఐఏఎస్‌ను రాజకీయంగా నడిరోడ్డుపై నిలబెట్టింది వైసీపీ అధిష్ఠానం.

ఇలా అయిందేమిటి గురుమూర్తికి?



తిరుపతి ఎంపీ గురుమూర్తిదీ ఇదే పరిస్థితి. ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిచారు. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. వివాదరహితుడు. బడా నేతలందరితోనూ వినయంగా మసలేవారు. ఢిల్లీకి అలవాటు పడుతుండగానే ఆయనను అసెంబ్లీకి పరిమితం చేశారు. సత్యవేడును కేటాయించారు. ఈ మూడు నెలల్లో అక్కడ అన్నీ వెతుక్కోవాలి. తనకంటూ వర్గాన్ని నిర్మించుకోవాలి. ఆఖరి నిమిషంలో ఇదేమిటిలా అయిపోయిందే అనే దిగులుతో ఆయన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

రెపరెపలాడుతున్న ఆశలో ఆరణి



బడా నేతకు జీ హుజూర్ అన్నా చిత్తూరు టికెట్ రెండోసారి సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు దక్కలేదు.సొంత ముద్రన్నదే లేకుండా అధికార సామాజికవర్గం బడా నేత చెప్పిందల్లా ఈయన చేశారు. అయితే బలిజ సామాజిక వర్గానికి చెందిన ఈయనకు చాపకింద నీరులా నియోజకవర్గంలో అగ్రవర్ణ నాయకుడిని సమాంతరంగా వెనుకనుంచి ఎగదోస్తూ వచ్చారు. చిత్తూరులో బలమైన సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా సరే, చివరికి ఆయనకు టికెట్ దక్కలేదు. ఆయన సామాజికవర్గాన్ని దువ్వడానికి రాజ్యసభ ఆశ చూపుతున్నా అదెంత వరకూ నెరవేరుతుందో తెలియని పరిస్థితి. రాజ్యసభ తాయిలంతో గట్టిగా తిరగబడనూ లేక, నోరు తెరిచి అన్యాయం జరిగిందని అడగనూ లేక మౌన రోదనలో ఉన్నారు ఆరణి శ్రీనివాసులు.

అభద్రతలో వీరు

నియోజకవర్గ ఇన్‌చార్జులను ప్రకటించిన చోటే కాదు, మిగిలిన నియోజకవర్గాల వైసీపీ నేతల్లోనూ టెన్షన్ కొనసాగుతోంది. జీడీ నెల్లూరులో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, నగరిలో మంత్రి ఆర్‌కే రోజా, పలమనేరులో వెంకటే గౌడ, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యలను ఇప్పటికీ అభద్రతా భావం వెన్నాడుతోంది. అధిష్ఠానం నారాయణస్వామికి టికెట్ నిరాకరించిందని తొలుత పార్టీలో ప్రచారమైంది. తర్వాత ఆయన బతిమాలుకోగా సీటు ఖరారు చేసినట్టు ప్రచారం జరిగింది. తాజాగా స్వామికి కాకుండా ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరు పరిశీలిస్తున్నట్టుగా ప్రచారమవుతోంది. వారంవారం వేర్వేరు ప్రచారాలు జరుగుతుండడంతో నారాయణస్వామి మానసిక వేదనకు గురవుతున్నట్టు సమాచారం. చీమ చిటుక్కుమన్నా చంద్రబాబుపై విరుచుకుపడే స్వామి ఇటీవల జోరు తగ్గించడం గమనార్హం. నగరిలో మంత్రి రోజాదీ అదే పరిస్థితి. మొదట్లో ఆమెకు టికెట్ లేదన్న వదంతులు ప్రబలాయి. ఓ దశలో తనకు టికెట్ రాకున్నా పరవాలేదని, పార్టీ కోసం త్యాగానికి సిద్ధమని ఆమె ప్రకటించారు కూడా. తర్వాత అధిష్ఠానం మెత్తబడి మళ్ళీ అవకాశమిస్తోందనే మాటలు వినిపించాయి. తరచూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌లపై విరుచుకుపడే రోజా కొంతకాలంగా మౌనం పాటిస్తున్నారు. ఇక సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యతో వైసీపీ అధిష్ఠానం పూటకో మాటతో ఆటాడుకుంటోంది. మూడో జాబితాలో సూళ్ళూరుపేటకు కొత్త వారిని ఇంఛార్జిగా వేయకపోవడంతో హమ్మయ్య అంటూ తాత్కాలికంగా ఊపిరి తీసుకున్నారాయన. టికెట్ గురించి రెండు మూడు నెలలుగా సంజీవయ్య తీవ్ర మానసిక వ్యధ అనుభవిస్తున్నారు. పలమనేరులో వెంకటేగౌడ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కాకపోతే ఆయనకు ప్రత్యామ్నాయం కోసం అధిష్ఠానం అన్వేషిస్తోంది. ఇటీవల వైసీపీలో చేరిన ఆర్వీ సుభాష్ చంద్రబోస్ పేరు టికెట్ రేసులో వినిపిస్తోంది. టికెట్ ఖరారయ్యే దాకా గౌడకు కూడా టెన్షన్ తప్పడం లేదు.

నిశ్చింతగా వారు

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అత్యధిక ఎమ్మెల్యేలు మాత్రమే ఉమ్మడి జిల్లాలో నిశ్చింతగా ఉన్నారు. రాజంపేట ఎంపీ, వెంకటగిరి, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, తంబళ్ళపల్లి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన సిట్టింగు ఎమ్మెల్యేలు, ఇద్దరు వారసులకు టికెట్ భద్రత కల్పించింది అధిష్ఠానం. వెంకటగిరిలో ఆనం రామనారాయణరెడ్డితో ఎప్పటికైనా సమస్య వస్తుందన్న భావనతో అధినేత ముందస్తుగానే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. ఆనంతో వ్యవహారం చెడగానే గంటల వ్యవధిలో రామ్‌కుమార్‌ను వెంకటగిరి ఇంఛార్జిగా నియమించేశారు. అప్పటి నుంచీ ఆయన నిశ్చింతగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లిలో మంత్రి సోదరుడు ద్వారకనాథరెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వంటి పాతకాపులు టికెట్‌పై ధీమాగా వుండి ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. వీరికి భిన్నంగా ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజికవర్గం సిటింగు ఎమ్మెల్యేలు టికెట్ పోగొట్టుకోవడమో లేక మరో స్థానానికి బదిలీ కావడమో జరుగుతోంది. దీంతో ఆయా వర్గాలకు చెందిన విద్యావంతులు, కాస్తోకూస్తో చైతన్యం కలిగిన వారు వైసీపీ అధిష్ఠానం తీరుతో రగిలిపోతున్నారు.

ఓటర్ల జాబితాలో సవరణలు,
కొత్త ఓటర్లు, తొలగింపులు, మార్పుచేర్పులు..

చంద్రగిరిలోనే ఎక్కువ ఎందుకిలా?

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితా సవరణల కోసం 4.15 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అందులో 70876 దరఖాస్తులను అధికారులు తిరస్కరించగా 343663 దరఖాస్తులను ఆమోదించారు. మిగిలిన 695 దరఖాస్తులు పెండింగులో వున్నాయి. వీటిలో చంద్రగిరిలోనే అత్యధికంగా 115788 దరఖాస్తులు సవరణలు కోరుతూ వచ్చాయి. ఆ తర్వాతి స్థానం తిరుపతిదే. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు దరఖాస్తుల్లోనూ చంద్రగిరే అగ్రస్థానంలో ఉండడం విశేషం. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు అందిన ఫిర్యాదుల్లోనూ ఈ రెండు నియోజకవర్గాలే ఎక్కువగా చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఓటరు జాబితాలకు సంబంధించి ఈనెల 7వ తేదీ నాటికి అందుబాటులో వున్న వివరాలను జిల్లా యంత్రాంగం శుక్రవారం విడుదల చేసింది.

ఎక్కడ ఎందరు సవరణలు కోరారు?

నియోజకవర్గం	దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం	పెండింగ్
గూడూరు	60696	2522	58115	58
సూళ్ళూరుపేట	41218	3490	37678	50
వెంకటగిరి	47958	3972	43711	275
చంద్రగిరి	115788	43572	72199	17
తిరుపతి	64853	9866	54902	85
శ్రీకాళహస్తి	45422	5241	40173	8
సత్యవేడు	39299	2213	36884	202
మొత్తం	415234	70876	343663	695

■ కొత్త ఓటర్లూ చంద్రగిరిలోనే ఎక్కువ

జిల్లా మొత్తం మీద కొత్తగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునేందుకు 133810 దరఖాస్తులు (ఫామ్-6) వచ్చాయి. వాటిలో 36120 తిరస్కరణకు గురి కాగా 97685 దరఖాస్తులు ఆమోదించి పేర్లను జాబితాలో నమోదు చేశారు. కేవలం ఐదు దరఖాస్తులు మాత్రమే పెండింగులో వున్నాయి. ఇక్కడ కూడా చంద్రగిరిలోనే అత్యధికంగా 50 వేల దరఖాస్తులందగా వాటిలో సగానికి పైగా అంటే 25929 దరఖాస్తులను తిరస్కరించారు. అంటే అవన్నీ బోగస్ క్లయిమ్‌లుగా పరిగణించాల్సి వుంటుంది.

నియోజకవర్గం	ఫామ్6 దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం
గూడూరు	11350	488	10861
సూళ్ళూరుపేట	12258	1457	10800
వెంకటగిరి	11957	470	11487
చంద్రగిరి	50003	25929	24073
తిరుపతి	21337	4075	17262
శ్రీకాళహస్తి	15387	2540	12845
సత్యవేడు	11518	1161	10357
మొత్తం	133810	36120	97685

■ తొలగింపుల దరఖాస్తుల తీరు ఇదీ..

ఓటర్ల జాబితా నుంచీ మృతి చెందిన వారి పేర్లు, వలస వెళ్ళిపోయిన వారి పేర్లు తొలగించేందుకు ఉద్దేశించిన ఫామ్ 7 దరఖాస్తులు జిల్లావ్యాప్తంగా 104634 వచ్చాయి. వాటిలో 24618 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా 79830 దరఖాస్తులను ఆమోదించి జాబితా నుంచీ తొలగించారు. 186 దరఖాస్తులు పెండింగులో వున్నాయి. తొలగింపులకు సంబంధించి కూడా చంద్రగిరి నియోజకవర్గంలోనే అత్యధికంగా 30377 దరఖాస్తులు అందాయి. తొలగింపుల కోసం అందిన దరఖాస్తుల్లో సుమారు 14 వేల దరఖాస్తులు బోగస్‌వని భావించాల్సి వస్తోంది.

నియోజకవర్గం	ఫామ్7 దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం
గూడూరు	13762	1399	12358
సూళ్ళూరుపేట	9399	1333	8058
వెంకటగిరి	9629	2751	6827
చంద్రగిరి	30377	13772	16589
తిరుపతి	16783	3173	13526
శ్రీకాళహస్తి	15996	1601	14389
సత్యవేడు	8688	589	8083
మొత్తం	104634	24618	79830

■ మార్పుచేర్పులకు 176790 దరఖాస్తులు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల మార్పు, అలాగే పేర్లు, ఫొటోల మార్పు వంటివాటికి సంబంధించిన ఫామ్ 8 దరఖాస్తులు 176790 అందాయి. వాటిలో 10138 దరఖాస్తులను తిరస్కరించిన అధికారులు 166148 దరఖాస్తులను ఆమోదించారు. 504 దరఖాస్తులు మాత్రమే పెండింగులో వున్నాయి. ఈ దరఖాస్తులు అత్యధికంగా గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల నుంచీ అందాయి. గూడూరులో 35584, చంద్రగిరి 35408 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

నియోజకవర్గం	ఫామ్8 దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం	పెండింగ్
గూడూరు	35584	635	34897	52
సూళ్ళూరుపేట	19561	700	18820	41
వెంకటగిరి	26372	751	25397	224
చంద్రగిరి	35408	3871	31537	0
తిరుపతి	26733	2618	24114	1
శ్రీకాళహస్తి	14039	1100	12939	0
సత్యవేడు	19093	463	18444	186
మొత్తం	176790	10138	166148	504

ఆచూకీ తేలని ఓటర్లు 152మందే

జిల్లాలో ఒకే డోర్ నంబరులో పదిమందికి మించి ఓటర్లున్న అంశం వివాదాస్పదమైంది. ఇలా 5753 ఇళ్ళలో 82040 మంది ఓటర్లు వున్నట్టు యంత్రాంగం గుర్తించింది. అయితే గతేడాది జూన్ 15వ తేదీ నుంచీ చేపట్టిన పరిశీలనలతో క్రమేపీ తగ్గుముఖం పడుతూ ఈనెల 7వ తేదీ నాటికి 152 మంది ఓటర్ల పరిశీలన మాత్రమే మిగిలింది.అంటే జిల్లాలో ఇంకా ఆచూకీ తెలియని ఓటర్ల సంఖ్య 152.

జీరో డోర్ నంబరు ఇళ్ళు 519

జిల్లాలో జీరో డోర్ నంబర్లు కలిగిన ఇళ్ళ పేరిట పెద్ద సంఖ్యలో ఓటర్లు నమోదైన సంగతి తెలిసిందే. గతేడాది జూన్ 15వ తేదీ నాటికి జిల్లాలో ఇలాంటి డోర్ నంబర్లు కలిగిన ఇళ్ళ సంఖ్య 31073 వుండగా అధికారులు క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలనల ఫలితంగా వీటి సంఖ్య ఈనెల 7వ తేదీ నాటికి 519కి తగ్గింది.

తిరుమల ఘాట్‌రోడ్డులో డ్రోన్ చిత్రీకరణ !




తిరుమల ఘాట్ రోడ్డులో డ్రోన్ ఎగరవేస్తున్న దినేష్ - ఘాట్‌రోడ్డులో ఎగురుతున్న డ్రోన్

తిరుమల, జనవరి12(ఆంధ్రజ్యోతి):నిబంధనలకు విరుద్ధంగా హర్యానాకు చెందిన ఓ భక్తుడు డ్రోన్ కెమెరాతో తిరుమలకు రావడమే కాకుండా మొదటి ఘాట్‌రోడ్డులో డ్రోన్‌ను పైకి పంపి వీడియో తీయడం కలకలం సృష్టించింది. హర్యానాకు చెందిన దినేష్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చాడు. దర్శనం ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్‌రోడ్డులోని 53వ మలుపు వద్ద కారు ఆపి డ్రోన్ కెమెరాను పైకి ఎగరవేసి వీడియో తీశాడు.మీడియా ద్వారా సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు అతడిని అలిపిరిలో అదుపులోకి తీసుకుని తిరుమల పోలీసులకు అప్పగించారు.భద్రతా కారణాలతో పాటు ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం డ్రోన్‌ను ఎగరవేయడాన్ని టీటీడీ కొన్నేళ్ల క్రితమే నిషేధించింది. డ్రోన్‌తో ఎవరైనా తిరుమలకు వచ్చే ప్రయత్నం చేస్తే అలిపిరిలోనే భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీన పరుచుకోవాలి. అయితే అలిపిరి భద్రతా సిబ్బంది నిర్లక్ష్య తనిఖీ కారణంగా భక్తుడు డ్రోన్ కెమెరాతో నేరుగా తిరుమలకు వచ్చాడు. ఘాట్‌రోడ్డులో డ్రోన్‌తో వీడియో తీస్తున్న క్రమంలో పట్టుబడ్డాడు. కొద్ది నెలల క్రితం ఆలయంపై ఓ డ్రోన్ వెళ్లిన ఘటన కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో మరోసారి టీటీడీ విమర్శలపాలయ్యింది. ఈ విషయమై టీటీడీ నిబంధనలపై అవగాహన లేని వ్యక్తి ఎగురవేసిన తేలికపాటి ప్లాస్టిక్ డ్రోన్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని టీటీడీ ఓ ప్రకటన ద్వారా తెలిపింది. ఇది చిన్న ప్లాస్టిక్ డ్రోన్ కావడంతో అలిపిరి స్కానింగ్ పాయింట్‌లో సైతం గుర్తించడం సాధ్యం కాలేదంది.డ్రోన్ ఎగురవేసిన దినేష్‌ను తిరుమల పోలీసులు విచారిస్తున్నారు. డ్రోన్ ఎలా తీసుకువచ్చారు, దేనికోసం తీసుకువచ్చారు అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. కాగా, దినేష్ ఆర్మీలో ఎస్పీ స్థాయి అధికారి కావడంతో వివరణ తీసుకుంటున్నారు. తనకు నిబంధనలు తెలియకపోవడతోనే డ్రోన్‌ను వినియోగించినట్టు దినేష్ చెప్పినట్టు తెలిసింది.

నానీ ఆరోగ్యం కోసం పూజలు



గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జనవరి 12: మిట్టూరు విజయగణపతి ఆలయం వద్ద శుక్రవారం కమ్మకండ్రిగ, మిట్టూరు గ్రామస్తులు చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని పూజలు నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు జనార్థన్ చౌదరి, నరసింహులు నాయుడు, మచ్చామోహన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

రామచంద్రాపురం, జనవరి 12: కమ్మకండ్రిగ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ బాలయ్య, హెచ్‌ఎం వాగ్దేవి, సర్పంచ్ వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

వైజాగ్ విమానం రద్దు చేయడంతో 26మందికి తప్పని ఇక్కట్లు



రేణిగుంట, జనవరి 12 : తిరుపతి విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్నం బయల్దేరవలసిన ఇండిగో విమానం రద్దు కావడంతో 26మంది ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రయాణికులు విమానాశ్రయంలోకి వెళ్ళి చెక్‌అవుట్ పూర్తి చేసుకున్న అనంతరం విమానం రద్దయినట్లు ఇండిగో విమాన యాజమాన్యం ప్రకటించినట్లు ప్రయాణికులు తెలిపారు.తమకు ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేయాలని కోరగా, శనివారం సాయంత్రంలోపు ఏర్పాటు చేస్తామని ఇండిగో మేనేజరు శివరామకృష్ణవరప్రసాద్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే విమాన ఛార్జీలను రీఫండ్ చేయడానికి తనకు అనుమతులు లేవని చెప్పారని తెలిపారు. అప్పటి వరకు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ప్రయాణికులు వాపోయారు.ఈ విషయంపై విమానాశ్రయ డైరెక్టర్ బసవరాజును వివరణ కోరగా ఇండిగో విమానం రద్దయిన విషయం నిజమేనన్నారు. ఆ ప్రయాణికులను ప్రత్యామ్నాయంగా చెన్నైనుంచి విశాఖ పంపించాలని ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించినట్లు ఆయన చెప్పారు.లేని పక్షంలో ప్రయాణికులను శనివారం ఉదయం విశాఖపట్నం పంపే ఏర్పాట్లు చేయాలని ఆదేశించామన్నారు.ప్రయాణికుల్లో కొందరు తమకు ఇప్పుడే ఇక్కడి నుంచే విమానం ఏర్పాటు చేయాలని ఇండిగో సిబ్బందిని ప్రయాణికులు నిలదీశారని డైరెక్టర్ తెలిపారు.గతంలోనూ ఇండిగో ఇలాగే ప్రయాణికులతో ఆడుకుందని ప్రయాణికులు ఆరోపించారు. ఈసారి తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో రద్దు చేశామని ఇండిగో మేనేజరు చెప్పినట్లు మణికంఠ అనే ప్రయాణికుడు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే పతనం తప్పదు



చంద్రగిరిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు

చంద్రగిరి, జనవరి 12: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ అన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమ్మె చంద్రగిరిలో శుక్రవారం 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని, అంగన్వాడీ వర్కర్లు 25 రోజులుగా సమ్మె చేపడుతున్నా కనీసం స్పందించడంలేదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, పద్మిని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలు, తహసీల్దార్లు తప్పులు దిద్దుకోండి

టీడీపీ నేత పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి12: చంద్రగిరి నియోజకవర్గంలోని బీఎల్వోలు, తహసీల్దార్లు ఓటర్ల నమోదులో తప్పులు దిద్దుకోవాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలలుగా బోగస్ ఓట్ల ఏరివేతకు కలెక్టర్, ఆర్డీవో, ఈఆర్వోలకు ఫిర్యాదులు చేశామని, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు. కానీ కొంతమంది అధికారులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి భయపడి ఫామ్-6, ఫామ్-8 రూపంలో చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధంలేని ఓటర్లని, ఆధార్ కార్డులేని ఓటర్లను భారీ స్థాయిలో చేర్చారని తెలిపారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా తుది దశకు చేరుకుందని, శుక్రవారంతో చేర్పులు, మార్పులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఈనెల 17న వెరిఫికేషన్ ఉంటుందని, 22న తుది జాబితా విడుదల అవుతుందన్నారు. తప్పులు సరిదిద్దుకోవాలని, ఇది మన భవిష్యత్తు అని, దొంగ ఓట్ల నమోదుకు పాల్పడుతున్న వాళ్ల కోసం ప్రాకులాడొద్దని హెచ్చరించారు.

ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు

తిరుపతి(లీగల్), జనవరి 12 : ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు బి.రవి, అనిల్‌కుమార్, నారాయణరెడ్డి, మునిబాష్యర్, తాతయ్య, మొహిద్దీన్ పాల్గొన్నారు.

5వ రోజుకు న్యాయవాదుల రిలే దీక్ష

తిరుపతి(లీగల్), జనవరి 12 : ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు నిరసనగా తిరుపతి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్ష ఐదవ రోజుకు చేరుకుంది. శుక్రవారం మహిళా న్యాయవాదులు బి.ఉషాకిరణ్, మల్లీశ్వరిదేవి, దీపశ్రీ, పద్మజ, హేమలత, ఆశ్రియా, సరళ, జ్యోతి పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగి మృత్యు ఒడికి..

తిరుమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం
విజయవాడ మహిళ మృతి

తిరుమల, జనవరి12(ఆంధ్రజ్యోతి) : తిరుమల ఘాట్‌రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. విజయవాడకు చెందిన దాసరి జ్యోతి మహి(15), సతీష్ మరో ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారు. దర్శనం ముగించుకుని జీఎన్సీ వద్ద బస్సు ఎదురుచూస్తున్న క్రమంలో తిరుమలలో వ్యాపారం చేసే ఓ వ్యక్తి తిరుమల నుంచి తిరుపతికి వెళుతున్న క్రమంలో లిఫ్ట్ అడిగారు. జ్యోతి మహి, సతీష్‌కు లిఫ్ట్ ఇచ్చిన ఆ వ్యక్తి మార్గంలోని 16వ మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు కోల్పోయాడు. దీంతో వాహనం కిందపడిపోయింది. ఈక్రమంలో వెనుక కూర్చుని ఉన్న జ్యోతి తల ఒక్కసారిగా రోడ్డుకు తగలడంతో జ్యోతి తీవ్ర రక్తగాయాలపాలయ్యింది. వెంటనే తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. జ్యోతిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. తలకు తీవ్ర గాయం కావడంతో మృతిచెందినట్టు అభిప్రాయపడ్డారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మరోవైపు మొదటిఘాట్‌రోడ్డులోని 14వ మలుపు వద్ద కూడా మరో ప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన లోకేశ్వరి తన భర్తతో కలిసి దర్శనానికి వచ్చారు. దర్శనం ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం తమ ద్విచక్రవాహనం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 14వ మలుపు వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లోకేశ్వరి తీవ్రగా గాయపడింది. ఆమెను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.



జ్యోతి మహి మృతదేహం - లోకేశ్వరి కాలుకైన గాయం

నారా భువనేశ్వరికి సాదర స్వాగతం



నారావారిపల్లెలో చంద్రబాబు కుటుంబానికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు

చంద్రగిరి, జనవరి 12 : సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు నారావారిపల్లెకు శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి సాదర స్వాగతం లభించింది. తన సోదరి లోకేశ్వరి, బంధువులు కంతమనేని శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన ఆమెకు తిరుపతి విమానాశ్రయంలో తెలుగు యువత నేత రవి నాయుడు తదితరులు స్వాగతం పలికారు.నారావారిపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, కోదండరామానాయుడు, హరినాథ్, దేశినేని నిరంజన్, తులసేశ్వరరెడ్డి, రాకేష్‌చౌదరి తదితరులు ఘన స్వాగతం పలికారు. శనివారం మధ్యాహ్నం నారా బ్రాహ్మణి, దేవాన్ష్‌లు రానుండగా ఆదివారం మధ్యాహ్నం చంద్రబాబు, లోకేష్ రానున్నారు.చంద్రబాబు ఏటా సంక్రాంతి పండగకు కుటుంబ సమేతంగా స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీగా పెట్టుకున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో చంద్రబాబు ఇంటి వద్ద, ఆయన తల్లి దండ్రుల సమాధుల వద్ద పరిసరాలను శుభ్రం చేయించారు. చంద్రబాబుకు, లోకేష్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే వారికోసం బారికేడ్లు, తాగునీరు, తేనీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.చంద్రబాబు ఇంటి ముందు రంగువల్లులు వేసి, వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తున్నారు. గ్రామంలో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేశారు. టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించడానికి గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపాన్ని వాడుకునేందుకు ముందస్తు అనుమతి తీసుకున్నారు. ఇప్పటికే టీడీపీ నాయకులు భారీఎత్తున ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో గ్రామాన్ని నింపేశారు.



నారా భువనేశ్వరికి తెలుగు యువత స్వాగతం

కలల సాకారానికి లక్ష్యాన్ని ఎంచుకోండి

- పద్మశ్రీ రవికన్నన్ పిలుపు ఎడిఫై ప్రీస్కూల్ వార్షికోత్సవం

తిరుచానూరు, జనవరి 12 : భవిష్యత్తులో మీ కలలను సాకారం చేసుకోవడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని ప్రముఖ క్యాన్సర్ శస్త్రచికిత్స వైద్యుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ రవికన్నన్ విద్యార్థులకు సూచించారు. తిరుచానూరులోని ఎడిఫై (ప్రీస్కూల్) 12వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థుల ఆలోచనలను గౌరవించాలని తల్లిదండ్రులు వారికి విలువ ఇవ్వాలని సూచించారు. పిల్లలకి తల్లిదండ్రులు సమయం కేటాయించి ఎప్పటికపుడు వారి అభిరుచులను తెలుసుకుని మంచి చెడులను వివరించాలన్నారు. పొగాకు, ఆల్కాహాల్‌తో ఎంతో మంది క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే యువత పొగాకు ఉత్పత్తులు, మద్యపానానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించి దేశాభివృద్ధికి తమవంతు కృషిని అందించాలన్నారు. ప్రముఖ హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ పిల్లలను చిన్నవయసు నుంచి ఇతరుల పట్ల గౌరవంగా నడుచుకునేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు. క్రమశిక్షణతో విద్య ద్వారా అన్ని రంగాల్లో రాణించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఫై విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ సులోచన, డైరెక్టర్ ప్రణీత్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కీర్తిప్రియ, జాహ్నవి, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డాక్టర్ రవికన్నన్

రేణిగుంట-నంద్యాల మధ్య ప్యాసింజరు రైలు ప్రారంభం



రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్యాసింజరు రైలును ప్రారంభిస్తున్న అధికారులు

రేణిగుంట, జనవరి12: దక్షిణ మధ్య రైల్వే అధికారులు రేణిగుంట- నంద్యాల మధ్య ప్రత్యేక ప్యాసింజరు రైలును శుక్రవారం సాయంత్రం 3.50 గంటలకు ప్రారంభించారు. గుంటూరు కేంద్రంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్ విధానంలో దీన్ని ప్రారంభించారు. అనంతరం గుంతకల్లు డివిజన్ ఏడీఆర్‌ఎం కె.సూర్యనారాయణ, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ పచ్చ జెండా ఊపి రేణిగుంటలో ప్రారంభించారు. ఈ రైలు ప్రతిరోజు నంద్యాలలో ఉదయం 5.40 గంటలకు బయలుదేరి కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లి, కోడూరు, బాలపల్లిరైల్వే స్టేషన్ల మీదుగా రేణిగుంటకు మధ్యాహ్నం 12.40 గంటలకు చేరుకొంటుంది. రేణిగుంటలో అదే రోజు 1.45 గంటలకు వచ్చిన మార్గంలోనే తిరిగి నంద్యాలకు రాత్రి9 గంటలకు చేరుకొంటుంది. తిరుపతి పుణ్యక్షేత్రాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల అవసరాల మేరకు రైళ్ల సంఖ్యను పెంచడానికి అధికారులు నంద్యాల -కడప వరకు రోజువారీ రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ప్యాసింజర్లు (07284-07285)ను రేణిగుంట రైల్వేజంక్షన్ వరకు పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు రైల్వే స్టేషన్ల మధ్య ఇప్పటి వరకు ప్యాసింజరు రైళ్లు లేవు. ఈ రైలు వల్ల తిరుమల- ఒంటిమిట్ట పుణ్యక్షేత్రాల మధ్య భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.ఈ మార్గంలో కోడూరు, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, కడప ప్రధాన రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌లు ఉంటాయి.పేద, మధ్య తరగతి ప్రజలకు, చిరు వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రేణిగుంటలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారులు అభిరాం, ప్రణయ్‌కుమార్, శేషగిరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కె.సుధాకర్, మధుసూదనరావు, ఎం.సందీప్ కుమార్, ఎస్‌వీ. రావు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు పి.చ్రంశేఖర్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు భరత్‌రెడ్డి, మురళీకృష్ణ, రాధాక్రిష్ణ, బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిజ, కాపులను మోసం చేసిన జగన్ రెడ్డి

- ఇప్పటికైనా ఆ పార్టీలో ఉండే నాయకులు మేల్కొనాలి
- టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ఓవీ రమణ




తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 70కి పైగా స్థానాల్లో ప్రభావితం చేసే బలిజలకు ఉన్న ఒక్క సీటు కూడా వైసీపీ లేకుండా చేసిందని, ఒకరకంగా జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత ఓవీ రమణ వ్యాఖ్యానించారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులం చూడం, మతం చూడం అని చెప్పిన జగన్ రెడ్డి వైఖరిని ఇప్పటికైనా ఆ పార్టీలోని కాపు నాయకులు గుర్తించాలన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేస్తూ, వారిపై అక్రమ కేసులు పెట్టించారని ధ్వజమెత్తారు. వైనాట్ 175 అంటున్న వైసీపీ నుంచి వంద మంది ఎమ్మెల్యేలు ఎందుకు బయటకు పోతున్నారో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. అదేవిధంగా వై ఏపీ నీడ్ జగన్ (రాష్ట్రానికి జగన్ ఎందుకంటే..) అంటూ ఇంటింట ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు 'వై నీడ్ ఫేక్ ఓట్స్' (దొంగ ఓట్లు అవసరం ఎందుకు) అని ప్రశ్నించారు. 24 శాతం ఓటర్లు ఉన్న బలిజ, కాపులకు రాజ్యాధికారం రావాల్సిందేనన్నారు. బలిజ, తెలగ, కాపులంతా ఒక తాటిపైకి వస్తున్నారని, టీడీపీ, జనసేన పార్టీల ద్వారానే మేలు జరుగుతుందని అన్నారు. ముద్రగడ పద్మనాభం టీడీపీ-జనసేనతో ఉండాలని నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. వైసీపీలో కాపు నాయకులు అయిష్టంగానే ఉన్నారని, చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులకు రాజ్యసభ సీటు ఇస్తామని మభ్యపెడుతోందని, అది జరిగేది కాదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

తిరుమల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

తిరుపతి (రవాణా), జనవరి 12: తిరుమల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. తిరుమల ఘాట్ రోడ్‌పై భక్తులు డ్రోన్ ఎగుర వేయడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలిపిరి టోల్‌గేట్ చెకింగ్ పాయింట్ వద్ద తనిఖీలు చేస్తున్నా డ్రోన్ కెమెరా కొండకు ఎలా వెళ్లగలిగిందని ప్రశ్నించారు. శేషాచలం కొండలను డ్రోన్ కెమెరాతో షూట్ చేయడంపై దర్యాప్తు జరపాలన్నారు. భక్తులకు అవగాహన కల్పించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, మీడియా ద్వారానూ ప్రచారం చేయాలని అన్నారు. అలిపిరిలో తనిఖీలు మరింత కట్టుదిట్టంగా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హాకీ విజేత జిల్లా జట్టు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 12: 14వ జూనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్‌షిప్‌ను తిరుపతి జిల్లా జట్టు కైవసం చేసుకుంది. మూడు రోజులుగా ఎస్వీయూ మైదానంలో జరిగిన ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు తిరుపతి, కడప జట్ల మధ్య ఫైనల్స్ హోరాహోరీగా సాగింది. 2-1తేడాతో తిరుపతి జిల్లా జట్టు విజయసాధించింది. కడప జిల్లా ద్వితీయ, అన్నమయ్య జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి.

రిమ్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

తిరుపతి(విద్య), జనవరి 12 : బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ సంప్రదాయం ఉట్టిపడేలా డూడూ బసవన్న విన్యాసాలు..ముత్యాల ముగ్గులు.. భోగిమంటలు..కొత్త కుండలలో పొంగుళ్లు.. సంక్రాంతి లక్ష్మి, సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు, గౌరీదేవికి గొబ్బితట్టి పాటలు ఆలపించడం, ఖోఖో, జానపద నృత్యాలు, గాలిపటాల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ వంటి కార్యక్రమాలతో సందడి చేశారు. అంతకుముందు సంస్థ డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డితో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి కలసి ప్రారంభించారు. పోటీలలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, ఎంసీఏ హెడ్ పి.మధుర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **శ్రీరామ ఇంజనీరింగ్‌లో :** కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లులు, గాలిపటాలు ఎగరేయడం వంటి పలు పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన వారికి డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.




రిమ్స్ కళాశాలలో.. శ్రీరామ ఇంజనీరింగ్‌లో..

మహేష్‌బాబు అభిమానుల అన్నదానం

పాకాల, జనవరి 12: మహేష్‌బాబు సినిమా గుంటూరు కారం విడుదల సందర్భంగా స్థానిక రామకృష్ణ డీలక్స్ సినిమా థియేటర్ వద్ద అభిమానులు శుక్రవారం అన్నదానం చేశారు.పి.చలపతిరెడ్డి,హేమంత్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, జితేంద్రరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం

ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి



వివేకానందుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 12: స్వామి వివేకానంద యువతకు ఆదర్శనీయులని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వివేకానంద కేంద్రం (కన్యాకుమారి) తిరుపతి శాఖ శనివారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించింది. వివేకానందుడి చిత్రపటానికి వీసీ పుష్పాంజలి ఘటించి మాట్లాడుతూ వివేకానందుడి మార్గంలో నడిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వివేకాంద కేంద్రం ప్రతినిధి డాక్టర్ పాకనాటి హరికృష్ణయాదవ్ మాట్లాడుతూ వివేకానంద బోధనలను ఈ తరం తెలుసుకోవాలని కోరారు. వివేకానంద కేంద్రం సభ్యులు ప్రసన్నకుమార్ రెడ్డి, అనిల్, తిలక్, అమరేశ్వరి, గిరిరాజ్, వెంకటకల్యాణ్ పాల్గొన్నారు.

చండీకుమారికి ఉత్తమ అధ్యాపక అవార్డు



అవార్డు అందుకుంటున్న చండీకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 12 : మహిళా యూనివర్సిటీ మైక్రోబయాలజీ అధ్యాపకురాలు చండీకుమారి ఉత్తమ అధ్యాపక అవార్డు పొందారు. తమిళనాడులోని భారతీదాసన్ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆమె శుక్రవారం ఈ అవార్డును స్వీకరించారు. జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని ఆమెను అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 12: పద్మావతి మహిళా యూనివర్సిటీ రూపొందించిన క్యాలెండర్‌ను వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని ఆవిష్కరించారు. ఈ ఏడాది యూనివర్సిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నట్టు వారు తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

తిరుపతి(కొర్లగుంట), జనవరి 12 : సంక్రాంతిని పురస్కరించుకుని పీపుల్స్ చారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీఎంసీ కల్యాణ మండపం పక్కన రాతిపని చేసుకుంటున్న కూలీలకు సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ చారిటీ ప్రతినిధి రాయపాటి మనోహర్, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

తిరుపతి సిటీ, జనవరి 12 : మన సంస్కృతి సంప్రదాయాల్లో ముగ్గులకు ఎంతో ప్రాధాన్యత ఉందని అలాంటి ముగ్గుల కళను రక్షించుకోవడం మన బాధ్యతని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆయన కళాశాల ఆవరణలోని భువన విజయం ఆడిటోరియంలో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మాధవీలత, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి అందమైన ముగ్గులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సునీత, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు సునీత, రోజా రమణి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు భద్రత కల్పిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 12 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో భవనాల నిర్మాణం జరుగుతున్న క్రమంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని ఐపీఎఫ్ మధుసూదనరావు కోరారు. శుక్రవారం స్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. భవనాలు నిర్మిస్తున్న క్రమంలో స్టేషన్ లోపలకు దొంగలు చొరబడే అవకాశముందని, ఈ క్రమంలో ప్రయాణికులు వారి బారిన పడకుండా భద్రత కల్పించాల్సిన అవసరముందని అన్నారు. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని శాఖల ఉద్యోగులు జాగ్రతిగా ఉండాలని సూచించారు. ఎస్‌ఎంఆర్ చిన్నప్పరెడ్డితోపాటు అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి

వివేకానందుడి మార్గం అనుసరణీయం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి (కల్చరల్), జనవరి 12 : నేటి యువ తరం స్వామి వివేకానందుని మార్గంలో పయనించాలని పలువురు వక్తలు కోరారు. శుక్రవారం స్వామి వివేకానంద 161 జయంతిని రామకృష్ణాశ్రమం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అక్కడి నుంచి రామకృష్ణ మిషన్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ విద్యార్థులు వివేకానందుడు ప్రబోధించిన మార్గంలో గమ్యం చేరే వరకూ విశ్రమించకుండా ముందుకు సాగాలన్నారు. ముఖ్య అతిథి, భారతీయ విద్యా భవన్ సంచాలకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ వివేకానందుడు గొప్ప దేశ భక్తుడని, ఆయన్ను చూసి ఎందరో స్ఫూర్తి పొందారని పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మురళీకృష్ణ, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ నిరంజన్ బాబు ప్రసంగించారు. అనంతరం రామకృష్ణ మఠం డిసెంబరులో తిరుపతిలోని విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రామకృష్ణ, శారదా మాత, వివేకానందుని వేషధారణలో చిన్నారులు అలరించారు. స్వామి సత్వస్థానంద పాల్గొన్నారు.

ఆర్కే అబాకస్‌లో వివేకానంద జయంతి


నివాళి అర్పిస్తున్న ఆర్కే అబాకస్ విద్యార్థులు, చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి - నివాళి అర్పిస్తున్న బాలాజి, నాయకులు

తిరుపతి(విద్య), జనవరి 12: ఎంఆర్‌పల్లె, కేటీరోడ్డులలో ఉన్న ఆర్కే అబాకస్ సంస్థల్లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్కే విమల, డాక్టర్ వెంకటేశ్వర్లు టీచర్లు, కలసి పుష్పాలతో వివేకానందుని చిత్రపటానికి నివాళి అర్పించారు. విద్యార్థులకు వివేకానందుని జీవిత చరిత్రతో కూడిన పాకెట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఆపస్ ఆధ్వర్యంలో: స్థానిక ఎస్వీ మెడికల్ కాలేజ్ సర్కిల్‌లో ఉన్న వివేకానందుని విగ్రహానికి ఏపీ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి నేతృత్వంలో పుష్పమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాంబిరెడ్డి, సహాధ్యక్షులు సుభాష్‌చంద్రదాస్, కోశాధికారి పట్టాభి, కార్యదర్శి మహేష్, నాయకులు మధు, మేనకాపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్

తిరుపతి(విద్య), జనవరి 12 : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెన్సీ విడుదల చేసిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం పేర్కొన్నారు. పి.నిఖిత్ 400కి 360 మార్కులు, ఎస్.సౌమ్య, ఎస్.దివాకర్‌రెడ్డి 354, కె.ద్వారకనాథరెడ్డి 348, ఎస్.అయూబ్ 338, ఎస్.ఆరిఫుల్లా 334, బి.యోగేష్ 330 మార్కులతో టాపర్లుగా నిలిచారని వెల్లడించారు. మొత్తంగా 91.67శాతం మంది పాసయ్యారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ టి.నాదముని, అధ్యాపకులు అభినందించారు.

పీఆర్సీలో 40శాతం ఫిట్మెంట్ ఇవ్వాలి

హిందూ ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు మహేష్

తిరుపతి(విద్య), జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాబోవు పీఆర్సీలో 40శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల కోరారు. ఈ మేరకు సంఘ ఆధ్వర్యంలో కడపలో నిర్వహించిన నాల్గవ జాతీయ మహాసభలో తీర్మానించామని తెలిపారు. రాష్ట్రంలో హిందూ ఉద్యోగుల పట్ల పాలకుల వివక్షను తొలగించేందుకు తగు కార్యాచరణ రూపొందించామని వివరించారు. హిందువుల పండుగ సెలవుల విషయంలో నిర్లక్ష్య ధోరణి, ఉద్యోగుల ఆర్థిక బకాయిలు, పీఎఫ్, డీఏలు వంటి అంశాలపై చర్చించామని తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, కురువ చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, గురుప్రసాద్, రామాంజులు, విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు ఎర్ర స్మగ్లర్ల అరెస్టు

● 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఎర్రచందనం దుంగలతో సహా పట్టుబడ్డ స్మగ్లర్లు

తిరుపతి అర్బన్, జనవరి 14: టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించి ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కారు సహా 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం కల్యాణిడ్యాం నుంచి చీకటికోన మీదుగా శ్రీవారిమెట్టు వైపు కూంబింగ్ నిర్వహిస్తుండగా భాకరాపేట రేంజ్ నాగపట్ల ఈస్ట్ ఫారెస్టు బీట్ పరిధిలో కొంతమంది దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారని తెలిపారు. వారిని చుట్టుముట్టగా రాళ్లు, గొడ్డళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నం చేశారన్నారు. వారిలో తిరువణ్ణామలై జమున మత్తూరుకు చెందిన మణి అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకుని, 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఆర్ఎస్ఐ ఆలీబాషా బృందం గూడూరు, నాయుడుపేట హైవే బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తెల్లవారుజామున కొందరు ఓ కారును వదిలి పారిపోయే ప్రయత్నం చేయగా దాన్ని చుట్టుముట్టి తనిఖీ చేయగా 7 ఎర్రచందనం దుంగలు కనిపించాయన్నారు. తమిళనాడు తిరుపత్తూరుకు చెందిన హరీష్‌శక్తి(24), వేలూరు జిల్లాకు చెందిన సంతోష్ సెట్టు(23), ప్రభు ముత్తుస్వామి(23), శరత్‌కుమార్(21), రామచంద్రన్(26)ను అరెస్టు చేశామన్నారు. ఈ రెండు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనంతో సహా 18 ఎర్రచందనం దుంగల విలువ రూ.20లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసులను సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


వవా - నిమ్మగడ్డ రమేష్‌కుమార్ - షణ్ముగం - మురళీకార్తీక్

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీవీ వవా, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఇండియన్ క్రికెటర్ మురళీ కార్తీక్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. అంతకుముందు సింగపూర్ మంత్రి షణ్ముగం అభిషేకసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 12 : సెంట్రల్ బస్టేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడీ చెంగల్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు తిరుపతి డిపో మేనేజర్ కార్యాలయంలో లభిస్తుందని, ఆసక్తిగలవారు ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2గంటల లోపు అందజేయాలని కోరారు. శ్రీహరి బస్టాండులో 8, శ్రీనివాసలో 8, కమర్షియల్ కాంప్లెక్స్‌లో 7 దుకాణాలు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

స్విమ్స్‌లో 15న ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి సిటీ, జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15న(సోమవారం) స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం

తిరుపతి (కల్చరల్), జనవరి 12 : ఇజ్రాయిల్ దాడిలో పలు ఇబ్బందులు పడుతున్న పాలస్తీనా ప్రజలకు పౌర చైతన్య వేదిక తిరుపతి శాఖ అధ్యక్షుడు వాకా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.కుమార్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఇజ్రాయిల్ వంద రోజులుగా చేస్తున్న బాంబు దాడుల్లో 50 వేల మంది పాలస్తీనా పౌరులు మరణించి ఉంటారని, వీరిలో పిల్లలే అధిక శాతమని, ఈ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఇజ్రాయిల్ తీరును ప్రతిఘటించాలని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.33 కోట్లు

తిరుమల,జనవరి12(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.33 కోట్లు లభించింది. బుధవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 53,055 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 15,157 మంది తలనీలాలు సమర్పించారు.

పండుగ పూట మానోట్లో మట్టి కొట్టొద్దు

అంగన్వాడీల వినూత్న నిరసన



తిరుపతిలో అన్నం ప్లేట్లలో మట్టి పోసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అన్నం పెట్టే చేతులు ప్లేట్లలో మట్టిని పోసుకుని నిరసన తెలిపాయి. పండుగపూట కూడా మానోట్లో మట్టి కొట్టొద్దు జగన్ రెడ్డీ.. అంటూ జిల్లాలో పలుచోట్ల అంగన్వాడీ కార్యకర్తలు ప్లేట్లలో మట్టిని పోసుకుని ఆందోళన చేపట్టారు. అంగన్వాడీల సమ్మె శుక్రవారంతో 32వ రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా న్యాయపరమైన డిమాండ్ల కోసం నెల రోజులుగా రోడ్డున పడ్డామని, సంక్రాంతి రోజైనా తమ కుటుంబం కడుపునిండా అన్నం తినేందుకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి జీతాలు పెంచాలని తిరుపతిలోని దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు డిమాండు చేశారు.సమస్యలు పరిష్కరించకపోతే దీక్షా శిబిరాల్లోనే భోగి, సంక్రాంతి పండుగలను జరుపుకుంటామన్నారు.యూటీఎఫ్ నాయకలు ఎస్ఎస్ నాయుడు, ముత్యాల రెడ్డి, నిర్మల, రామచంద్రయ్య మద్దతు తెలిపిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేణుగోపాల్, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు. పిచ్చాటూరులోని దీక్షా శిబిరంలో కూడా కార్యకర్తలు ప్లేట్లలో మట్టిపోసుకుని నిరసన తెలిపారు. సత్యవేడులో సర్వమత ప్రార్థనలు చేశారు. శ్రీకాళహస్తిలో అంగన్వాడీ కార్యకర్తలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. గూడూరు, చంద్రగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లోనూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.

● యూనియన్ నేత హెప్సిబా తొలగింపు

అంగన్వాడీ కార్యకర్తలు విధుల్లో చేరాలని ఒత్తిడి తెచ్చిన అంగన్వాడీ యూనియన్ గూడూరు ప్రాజెక్టు నేత హెప్సిబాను ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మలీల, వాణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో లక్షమందికి పైగా అంగన్వాడీ కార్యకర్తలు పోరాటం చేస్తుంటే సమ్మెకు ద్రోహం చేసి, అధికారులకు లొంగిపోయి, సమ్మెలో ఉన్న కార్మికులకు అన్యాయం చేసిన హెప్సిబాకు ఇకపై సీఐటీయూతో కానీ అంగన్వాడీ యూనియన్‌తో కానీ ఎలాంటి సంబంధం ఉండదన్నారు.

70,876 ఓటరు దరఖాస్తుల తిరస్కరణ

22న తుది జాబితా ● కలెక్టర్ వెంకటరమణారెడ్డి


రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 12 : ప్రత్యేక ఓటర్ల సవరణలో భాగంగా జిల్లాలో అన్ని రకాల దరఖాస్తులు 4,15,234 అందాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో 70,876 తిరస్కరణకు గురయ్యాయని, 3,43,663 ఆమోదించగా 695 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఇంటింటి సర్వే ద్వారా పరిష్కరించినట్లు చెప్పారు. జంక్, జీరో డోర్ నెంబర్లకు సంబంధించి 31,073 పరిశీలనలో ఉన్నాయని, సాంకేతిక కారణాలతో 519 మాత్రమే ఆగి ఉన్నాయని, త్వరగా పరిష్కారం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పురుషోత్తంనాయుడు, టీడీపీ మనోహరాచారి, వైసీపీ చంద్రమౌళి, ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, చంద్రముని, శివశంకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, తహసీల్దారు వెంకటరమణ, సెక్షన్ తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చదువుకున్న యువత చికెన్, మటన్ అమ్ముకోవాల్సిందే

ఉద్యోగావకాశాలు కల్పించడంలో జగన్ విఫలం ● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు విమర్శ


మాంసం వ్యాపారం చేస్తూ తెలుగు యువత నేతల నిరసన

తిరుపతి (రవాణా), జనవరి 12: చదువుకున్న యువత చికెన్, మటన్ అమ్ముకోవాల్సిందేనంటూ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని వివేకానంద సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి, వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యువతను చికెన్, మటన్, చేపల కొట్టులలో పనిచేసే స్థాయికి తీసుకెళ్లావంటూ మాంసం అమ్ముతూ సీఎం జగన్‌కు యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ నిరసన తెలిపారు. రవినాయుడు మాట్లాడుతూ వివేకానంద జయింతి సందర్భంగా దేశమంతా యువజన ఉత్సవాలు చేసుకుంటుంటే రాష్ట్రంలో జగన్ పుణ్యమా అని ఉద్యోగాలు, ఉపాధిలేక యువత నిస్తేజంగా ఉందన్నారు. జాబ్ క్యాలెండర్ అడిగితే డ్రగ్స్, గంజాయి, మద్యం ఇచ్చి సీఎం జగన్ యువతను మత్తులోకి దించాడని విమర్శించారు. జగన్ గతంలో చెప్పిన మాటలు ఏమాత్రమూ అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కు వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 27వేల మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పీ శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధుబాబు, తోట వాసు, నియోజకవర్గ అధ్యక్షుడు కరణం సందీప్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు హేమంత్ రాయల్, శ్రీనివాస్‌యాదవ్, రంజిత్‌నాయుడు, ఖాజా, శ్రీరామ్ బాబి, లోకేష్ రాయల్, దిలీప్ రాయల్, గోపి, జయకృష్ణ, నవీన్, నాగరాజురెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యకు సాంకేతికతను జోడించండి

హైకోర్టు జడ్జి ఏవీ శేషసాయి


మాట్లాడుతున్న జస్టిస్ ఏవీ శేషసాయి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 12: న్యాయ విద్యకు సాంకేతికతను జోడించడం ద్వారా విద్యార్థులు ఉన్నత అవకాశాలను పొందవచ్చని హైకోర్టు జడ్జి ఏవీ శేషసాయి పేర్కొన్నారు. ఎస్వీయూ లా విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతలో అన్ని శక్తి యుక్తులు దాగుంటాయని అన్నారు. వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అనుకున్న రంగంలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో న్యాయ రంగానికి అవసరమైన ప్రతిభ, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయ సేవలు, మూట్ కోర్టు, డిబేట్లు, కాన్ఫరెన్సుల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో న్యాయ విద్యను ఔపోసన పట్టాలన్నారు. న్యాయరంగం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచే విధంగా అవసరమైన కార్యక్రమాలు చేపడతామన్నారు. మారుతున్న సమాజాన్ని, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫారం నెం.యుఆర్‌సి-2

ఛాప్టర్ ౧ పార్ట్-1 క్రింద రిజిస్ట్రేషన్ గురించి ప్రకటనకు ఇస్తున్న నోటీసు
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374 (బి) మరియు కంపెనీస్ (అథరైజ్డ్ టు రిజిస్టర్) రూల్స్,2014 యొక్క రూల్ 4(4)ను అనుసరించి)

1. ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 366 యొక్క ఉపసెక్షన్(2) ను అనుసరించి కంపెనీల చట్టం 2013 యొక్క ఛాప్టర్ యొక్క పార్ట్-1 క్రింద భాగస్వామ్య అయినటువంటి మెస్సర్స్ లలిత్ శ్రీ వెంకట్ ఇండస్ట్రీస్ కంపెనీ లిమిటెడ్ వాటాల సమోదుకు సంబంధించిన రిజిస్ట్రార్ ఎట్ విజయవాడ, ఆంధ్రప్రదేశ్ వారికి 15 రోజుల తరువాత ఇప్పటి నుంచి మరియు 30 రోజుల గడువు పూర్తి కాకముందే దరఖాస్తు చేసుకోవాలని యోచిస్తున్నది.
2. కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు దిగు విధంగా ఉన్నవి.
రైస్‌మిల్లింగ్, ఇతర పప్పు, ధాన్యాల, సుగంధ ద్రవ్యాల మిల్లింగ్, మరియు ఆయిల్ మిల్లింగ్ మరియు ఇతరు అనుబంధ కార్యకలాపాలు చేయుటకు.
3. ప్రతిపాదిత డ్రాఫ్ట్ మెమొరాండమ్ మరియు ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్ దిగువ చిరునామాలో తనిఖీ చేసుకొనవచ్చును. కార్యాలయం: డి.నెం.40, మోటార్ వర్కర్స్ కాలనీ, తిరుచానూరు రోడ్డు, తిరుపతి - 517501
4. ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమేమనగా ఈ దరఖాస్తు సంబంధించిన అభ్యంతరాలున్న ఎవరైనా వ్యక్తి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరవై ఒక్క (21) రోజుల్లోపు సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ రిజిస్ట్రార్(సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్, ప్లాటు నెం.6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనేసర్ జిల్లా, గుర్గావ్ (హర్యానా), పిన్‌కోడ్-122050 చిరునామాకు లిఖిత పూర్వకంగా వారి అభ్యంతరాలను తెలియజేయవచ్చును. దీనితోపాటు కంపెనీయొక్క పైన పేర్కొనబడిన రిజిస్టర్ కార్యాలయంలో సంప్రదించి ఒక కాపీని అందజేయాలి.


తేది: 13.01.2024
తిరుపతి

లలిత్ శ్రీవెంకట్ ఇండస్ట్రీస్ వారి తరఫున
సం/- మెతుకు కిషోర్ కుమార్, భాగస్వామి

పీఎం విశ్వకర్మ యోజనపై శిక్షణ ఇవ్వాలి

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 12 : జిల్లాలో పీఎం విశ్వకర్మ యోజన పథకానికి 15,234 దరఖాస్తులు అందాయని, వాటిని త్వరగా పరిశీలించి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో లబ్ధిదారులకు శిక్షణ ప్రారంభించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కార్యక్రమం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి అందిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 637 పరిశ్రమలకు గాను 593 అనుమతులు మంజూరు జరిగిందని, మరో 34 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల కమిటీకి అందిన మేరకు 13 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.0.85కోట్లు అందించడానికి ఆమోదం వచ్చినట్లు చెప్పారు. ఏపీఐఐసీ ద్వారా భూమి కేటాయించిన 146, నాయుడుపేట స్పెషల్ జోన్ ద్వారా భూమి కేటాయించిన 70 పరిశ్రమలు త్వరగా ఉత్పత్తులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజరు చంద్రశేఖర్, ఫ్యాక్టరీస్ ఆఫ్ చీఫ్ రామకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

ఓస్వా డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 12 : ఆర్టీసీ ఆఫీస్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ముద్రించిన డైరీని ఈడీ చెంగల్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యాలయ సిబ్బందికి ఉపయోగకర సమాచారంతో డైరీని ముద్రించారని కొనియాడారు. సీఎంఈ నరసింహులు, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, పీవో పార్థసారథి, ఓస్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హెచ్.రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎస్.వి.బాబు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు ఘన నివాళి


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జనసైనికులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 12 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయనకు ఘన నివాళి అర్పించారు. జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ముందున్న వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ అడ్వకేట్ శ్యామల, జన సైనికులు దినేష్ జైన్, బాబ్జీ, మధుబాబు, రాజమోహన్, రాజేష్ఆచారి, నాగరాజు, సుమన్, బాబుకిషోర్, హిమవంత్, వంశీ, సురేష్ పాల్గొన్నారు.

సఫాయి కర్మచారీల సంక్షేమమే లక్ష్యం


అధికారులతో సమీక్షిస్తున్న వహ


తిరుపతి(కలెక్టరేట్), జనవరి 12 : సఫాయి కర్మచారీల సంక్షేమమే కమిషన్ లక్ష్యమని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీవీ వహ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, శానిటేషన్ వర్కర్స్‌తో సమీక్షించారు. ఆయన మాట్లా డుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధి నిషేధం, వారి పునరావాస చట్టం 2013 అమలు పక్కాగా జరగాలని తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్లు ఉంటే వారు ఆ వృత్తి నుంచి బయటపడటం కోసం వన్‌టైం సెటిల్‌మెంట్‌గా రూ.40వేలు అందజేయాల్సి ఉంటుందని సూచించారు. వారి పిల్లలకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాల్సి ఉంటుందన్నారు. స్కాలర్‌షిప్, గృహం మంజూరు చేయాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి స్వయం ఉపాధిపై శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించి, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారు మరణిస్తే కుటుంబానికి రూ.10లక్షలు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలో చనిపోయిన ఇద్దరు స్కావెంజర్ కుటుంబాలకు అందించిన సాయంపై ఆరా తీశారు. అంతకు ముందు కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మాన్యువల్ స్కావెంజింగ్ లేదని తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక సమతా సంకల్ప ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన తిలకించారు. అదనపు ఎస్పీ కులశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా ఈడీ డాక్టర్ నరసింహులు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్డీఎం సుభాష్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనమే సంక్రాంతి



తిరుపతి (ఆటోనగర్) జనవరి 12: తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనమే సంక్రాంతి అని దిశ ఎస్ఐ అరుణ, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు పేర్కొన్నారు. రాస్ కొర్లగుంట కార్యాలయంలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి, ముగ్గులు వేశారు. వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేశారు. రాస్ పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



తిరుపతి (కొర్లగుంట), జనవరి 12 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సంస్కార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం స్థానిక ఎస్వీ మెడికల్ కళాశాల కూడలి వద్ద భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు సమర్పించి పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్కార్ ఫౌండేషన్ అధ్యక్షుడు సంస్కార్ రాజేష్‌కుమార్, భరత్‌కుమార్, అన్నదానం అనిల్, విశ్వనాథం, కంచి హేమాద్రి, మనోహర్, సుధీర్, పార విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

70,876 ఓటరు దరఖాస్తుల తిరస్కరణ

22న తుది జాబితా ● కలెక్టర్ వెంకటరమణారెడ్డి



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 12: ప్రత్యేక ఓటర్ల సవరణలో భాగంగా జిల్లాలో అన్ని రకాల దరఖాస్తులు 4,15,234 అందాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో 70,876 తిరస్కరణకు గురయ్యాయని, 3,43,663 ఆమోదించగా 695 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఇంటింటి సర్వే ద్వారా పరిష్కరించినట్లు చెప్పారు. జంక్, జీరో డోర్ నెంబర్లకు సంబంధించి 31,073 పరిశీలనలో ఉన్నాయని, సాంకేతిక కారణాలతో 519 మాత్రమే ఆగి ఉన్నాయని, త్వరగా పరిష్కారం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పురుషోత్తంనాయుడు, టీడీపీ మనోహరాచారి, వైసీపీ చంద్రమౌళి, ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, చంద్రముని, శివశంకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, తహసీల్దారు వెంకటరమణ, సెక్షన్ తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 15న ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి సిటీ, జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15న(సోమవారం) స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చదువుకున్న యువత

చికెన్, మటన్ అమ్ముకోవాల్సిందే

- ఉద్యోగావకాశాలు కల్పించడంలో జగన్ విఫలం
- తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు విమర్శ



మాంసం వ్యాపారం చేస్తూ తెలుగు యువత నేతల నిరసన

తిరుపతి (రవాణా), జనవరి 12: చదువుకున్న యువత చికెన్, మటన్ అమ్ముకోవాల్సిందేనంటూ తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని వివేకానంద సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి, వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యువతను చికెన్, మటన్, చేపల కొట్టులలో పనిచేసే స్థాయికి తీసుకెళ్లావంటూ మాంసం అమ్ముతూ సీఎం జగన్‌కు యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ నిరసన తెలిపారు. రవినాయుడు మాట్లాడుతూ వివేకానంద జయింతి సందర్భంగా దేశమంతా యువజన ఉత్సవాలు చేసుకుంటుంటే రాష్ట్రంలో జగన్ పుణ్యమా అని ఉద్యోగాలు, ఉపాధిలేక యువత నిస్తేజంగా ఉందన్నారు. జాబ్ క్యాలెండర్ అడిగితే డ్రగ్స్, గంజాయి, మద్యం ఇచ్చి సీఎం జగన్ యువతను మత్తులోకి దించాడని విమర్శించారు. జగన్ గతంలో చెప్పిన మాటలు ఏమాత్రమూ అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కు వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 27వేల మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఆర్పీ శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధుబాబు, తోట వాసు, నియోజకవర్గ అధ్యక్షుడు కరణం సందీప్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు హేమంత్ రాయల్, శ్రీనివాస్ యాదవ్, రంజిత్‌నాయుడు, ఖాజా, శ్రీరామ్ బాబి, లోకేష్ రాయల్, దిలీప్ రాయల్, గోపి, జయకృష్ణ, నవీన్, నాగరాజురెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బలిజ, కాపులను మోసం చేసిన జగన్ రెడ్డి

- ఇప్పటికైనా ఆ పార్టీలో ఉండే నాయకులు మేల్కొనాలి
- టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ఓవీ రమణ



తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 70కి పైగా స్థానాల్లో ప్రభావితం చేసే బలిజలకు ఉన్న ఒక్క సీటు కూడా వైసీపీ లేకుండా చేసిందని, ఒకరకంగా జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత ఓవీ రమణ వ్యాఖ్యానించారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులం చూడం, మతం చూడం అని చెప్పిన జగన్ రెడ్డి వైఖరిని ఇప్పటికైనా ఆ పార్టీలోని కాపు నాయకులు గుర్తించాలన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేస్తూ, వారిపై అక్రమ కేసులు పెట్టించారని ధ్వజమెత్తారు. వైనాట్ 175 అంటున్న వైసీపీ నుంచి వంద మంది ఎమ్మెల్యేలు ఎందుకు బయటకు పోతున్నారో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. అదేవిధంగా వై ఏపీ నీడ్ జగన్ (రాష్ట్రానికి జగన్ ఎందుకంటే..) అంటూ ఇంటింట ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు 'వై నీడ్ ఫేక్ ఓట్స్' (దొంగ ఓట్లు అవసరం ఎందుకు) అని ప్రశ్నించారు. 24 శాతం ఓటర్లు ఉన్న బలిజ, కాపులకు రాజ్యాధికారం రావాల్సిందేనన్నారు. బలిజ, తెలగ, కాపులంతా ఒక తాటిపైకి వస్తున్నారని, టీడీపీ, జనసేన పార్టీల ద్వారానే మేలు జరుగుతుందని అన్నారు. ముద్రగడ పద్మనాభం టీడీపీ-జనసేనతో ఉండాలని నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. వైసీపీలో కాపు నాయకులు అయిష్టంగానే ఉన్నారని, చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులుకు రాజ్యసభ సీటు ఇస్తామని మభ్యపెడుతోందని, అది జరిగేది కాదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



ఓజిలి మండలం కురుగొండ ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న చింతామోహన్

వాకాడు, జనవరి 12: రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వైసీపీ ప్రభుత్వం నాశనం చేస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. వాకాడులో శుక్రవారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలసి పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యమని చింతామోహన్ అన్నారు. కోటలో శుక్రవారం మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. కోట మండల అధ్యక్షురాలు కర్లపూడి సుధ, దయాకర్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని చింతామోహన్ అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేటలోని బాపూజీ వీధిలో ఇంటింటా తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించి ప్రచార కరపత్రాలను పంచారు. నాయకులు చందనమూడి శివ, రాజేంద్ర, వెంకటకృష్ణయ్య, ఈశ్వరయ్య, చిరంజీవి, మహిళా నాయకురాలు తేజోవతి పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలోని కురుగొండలో శుక్రవారం చింతామోహన్ విస్తృతంగా పర్యటించారు. ఉపాధ్యక్షుడు గాడి వెంకటయ్య, నాయుడుపేటటౌన్ అధ్యక్షుడు ఎస్కే నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరికి 19న చంద్రబాబు రాక?

వెంకటగిరి, జనవరి 12: మాజీ సీఎం చంద్రబాబు పార్లమెంట్ పరిధిలో తలపెట్టిన 'రా కదలిరా' బహిరంగ సభ ఈనెల 19వ తేదీన వెంకటగిరి మున్సిపాలిటీలో నిర్వహించనున్నట్లు అనధికారిక సమాచారం. ఈ విషయంపై టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. మరోవైపు శుక్రవారం మధ్యాహ్నం బహిరంగ సభ నిర్వహణకు నిర్ణయించిన వెంకటగిరి - తిరుపతి రోడ్డు మార్గంలోని స్థలాన్ని పార్టీ శ్రేణులతో కలిసి కురుగొండ్ల రామకృష్ణ సందర్శించారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక

గూడూరు, జనవరి 12: టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీలు వెన్నెముకలా నిలిచారని తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల స్థాయి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీని స్థాపించి బీసీలకు అధికప్రాధాన్యం కల్పించారన్నారు. తర్వాత చంద్రబాబు కూడా బీసీలకు అండగా నిలిచారని చెప్పారు. ఇక సమన్యాయం అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాత్రం అందరినీ మోసం చేసిందన్నారు. ముఖ్యంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 74 మంది బీసీ నేతలను హత్య చేసిందని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో బీసీలందరూ ఏకమై టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మునుస్వామి, గురువారెడ్డి, శంకర్, సదాశివం, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, గుండాల లీలావతి, ధనుంజయగౌడ్, మధుయాదవ్, పిళ్లేల శ్రీనివాసులు, అమరేంద్ర, బాలకృష్ణయాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న నరసింహయాదవ్

తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

వైజాగ్ విమానం రద్దు చేయడంతో 26మందికి తప్పని ఇక్కట్లు

రేణిగుంట, జనవరి 12 : తిరుపతి విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్నం బయల్దేరవలసిన ఇండిగో విమానం రద్దు కావడంతో 26మంది ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.ప్రయాణికులు విమానాశ్రయంలోకి వెళ్లి చెక్‌అవుట్ పూర్తి చేసుకున్న అనంతరం విమానం రద్దయినట్లు ఇండిగో విమాన యాజమాన్యం ప్రకటించినట్లు ప్రయాణికులు తెలిపారు.తమకు ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేయాలని కోరగా, శనివారం సాయంత్రంలోపు ఏర్పాటు చేస్తామని ఇండిగో మేనేజరు శివరామకృష్ణవరప్రసాద్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే విమాన ఛార్జీలను రీఫండ్ చేయడానికి తనకు అనుమతులు లేవని చెప్పారని తెలిపారు. అప్పటి వరకు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ప్రయాణికులు వాపోయారు.ఈ విషయంపై విమానాశ్రయ డైరెక్టర్ బసవరాజును వివరణ కోరగా ఇండిగో విమానం రద్దయిన విషయం నిజమేనన్నారు. ఆ ప్రయాణికులను ప్రత్యామ్నాయంగా చెన్నై నుంచి విశాఖ పంపించాలని ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించినట్లు ఆయన చెప్పారు. లేని పక్షంలో ప్రయాణికులను శనివారం ఉదయం విశాఖపట్నం పంపే ఏర్పాట్లు చేయాలని ఆదేశించామన్నారు.ప్రయాణికుల్లో కొందరు తమకు ఇప్పుడే ఇక్కడి నుంచే విమానం ఏర్పాటు చేయాలని ఇండిగో సిబ్బందిని ప్రయాణికులు నిలదీశారని డైరెక్టర్ తెలిపారు.గతంలోనూ ఇండిగో ఇలాగే ప్రయాణికులతో ఆడుకుందని ప్రయాణికులు ఆరోపించారు. ఈసారి తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో రద్దు చేశామని ఇండిగో మేనేజరు చెప్పినట్లు మణికంఠ అనే ప్రయాణికుడు తెలిపారు.

నోరు మంచిదైతే

ఊరు మంచిదవుతుంది రోజమ్మా!

- మంత్రికి టీడీపీ నేత బండారు సూచన
- నగరి కోర్టుకు హాజరైన సత్యనారాయణమూర్తి



నగరి కోర్టుకు హాజరైన టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణ మూర్తి

నగరి, జనవరి 12: 'మాటలు సక్రమంగా మాట్లాడితే పరవాలేదు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది రోజమ్మా' అంటూ మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి వ్యాఖ్యానించారు. తనను అసభ్యంగా దూషించారంటూ ఆయనపై నగరి జుడిషియల్ కోర్టులో మంత్రి రోజా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు వాయిదాలో భాగంగా శుక్రవారం సత్యనారాయణమూర్తి నగరికి వచ్చారు. కాగా, ఈ కేసును ఫిబ్రవరి 13వ తేదికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి విష్ణువర్మ ఆదేశాలిచ్చారు. కాగా, నగరిలో బండారు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలను లొంగదీసుకోవాలని అక్రమ కేసులతో ప్రభుత్వం వేధిస్తోందన్నారు. తనపైనా పలుచోట్ల కేసులు పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ నేతల దుశ్చర్యలపై తాము ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదన్నారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని బాగుచేయాలన్న దృక్పథంతో ప్రజల వద్దకు వెళుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. ఎన్నో కేసుల్లో నిందితుడైన జగన్ 2024 ఎన్నికల తర్వాత చంచలగూడకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, ఖాదర్ భాయ్ రుక్కుం బాలాజీతో పాటు ఆయన వ్యక్తిగత లాయర్లు, నగరి టీడీపీ న్యాయవాది జగదీష్ పాల్గొన్నారు.

పండుగ పూట

మానోట్లో మట్టి కొట్టొద్దు

అంగన్వాడీల వినూత్న నిరసన



ప్లేట్లలో మట్టిని పెట్టుకుని తిరుపతిలో అంగన్వాడీల నిరసన

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అన్నం పెట్టే చేతులు ప్లేట్లలో మట్టిని పోసుకుని నిరసన తెలిపాయి. పండుగపూట కూడా మానోట్లో మట్టికొట్టొద్దు జగన్ రెడ్డీ.. అంటూ జిల్లాలో పలుచోట్ల అంగన్వాడీ కార్యకర్తలు ప్లేట్లలో మట్టిని పోసుకుని ఆందోళన చేపట్టారు. అంగన్వాడీల సమ్మె శుక్రవారంతో 32వ రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా న్యాయపరమైన డిమాండ్ల కోసం నెల రోజులుగా రోడ్డున పడ్డామని, సంక్రాంతి రోజైనా తమ కుటుంబం కడుపునిండా అన్నం తినేందుకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి జీతాలు పెంచాలని తిరుపతిలోని దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు డిమాండు చేశారు.సమస్యలు పరిష్కరించకపోతే దీక్షా శిబిరాల్లోనే భోగి, సంక్రాంతి పండుగలను జరుపుకుంటామన్నారు.యూటీఎఫ్ నాయకలు ఎస్ఎస్ నాయుడు, ముత్యాల రెడ్డి, నిర్మల, రామచంద్రయ్య మద్దతు తెలిపిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేణుగోపాల్, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు. గూడూరు, చంద్రగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లోనూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.

యూనియన్ నేత హెప్సిబా తొలగింపు

అంగన్వాడీ కార్యకర్తలు విధుల్లో చేరాలని ఒత్తిడి తెచ్చిన అంగన్వాడీ యూనియన్ గూడూరు ప్రాజెక్టు నేత హెప్సిబాను ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మలీల, వాణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో లక్షమందికి పైగా అంగన్వాడీ కార్యకర్తలు పోరాటం చేస్తుంటే సమ్మెకు ద్రోహం చేసి, అధికారులకు లొంగిపోయి, సమ్మెలో ఉన్న కార్మికులకు అన్యాయం చేసిన హెప్సిబాకు ఇకపై సీఐటీయూతో కానీ అంగన్వాడీ యూనియన్‌తో కానీ ఎలాంటి సంబంధం ఉండదన్నారు.

ఎమ్మెల్యే కిలివేటి పూజలు



నాయుడుపేట, జనవరి 12 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం విజయవాడలోని కనక దుర్గమ్మ దేవస్థానంలో పూజలు చేశారు.వచ్చే ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంజీవయ్యను వైసీపీ అధిష్ఠానం ఖరారు చేయడంతో ఈ పూజలు చేసినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. సంజీవయ్య వెంట డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సహకారసంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు దశరథరామిరెడ్డి, మద్దూరు కిషోర్‌యాదవ్, హరనాథ్‌రెడ్డి, చిన్ని సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, ఖాదర్‌బాషా, వాసు తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య వ్యతిరేక వర్గ సమావేశం



ఎమ్మెల్యే సంజీవయ్యకు టిక్కెట్ ఖరారైందన్న సమాచారంతో ఆయన వ్యతిరేక వర్గీయులు నాయుడుపేటలోని వైసీపీ రైతువిభాగ రాష్ట్ర కార్యదర్శి కళత్తూరు రామమోహన్‌రెడ్డి ఇంట్లో సమావేశమయ్యారు. జగనన్న ముద్దు... సంజీవయ్య వద్దు అనే నినాదంతో సంక్రాంతి పండుగ తరువాత సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర రెడ్డి, నాయకులు జనార్దన రెడ్డి, పాండురంగ యాదవ్, శేఖర్‌రెడ్డి, కమలాకరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి,రామచంద్రారెడ్డి, రాజసులోచనమ్మ, రవి, జగదీష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్ మొదలియార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో 10 కిలోల గంజాయి పట్టివేత

- దంపతుల అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, జనవరి 12: ఆర్టీసీ బస్సులో పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, దంపతులను అరెస్టు చేశారు. స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మీడియాకు వివరాలు తెలిపారు. చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. అలాగే తణుకు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సునూ పరిశీలించారు. ఆ బస్సులో తిరుపతి పార్వతీపురానికి చెందిన ఈశ్వర్ అతడి భార్య రమణమ్మ వద్ద 10 కిలోల గంజాయి ఉండటాన్ని గుర్తించారు. దాంతో దంపతులను అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈశ్వర్ ఆటో నడుపుతుంటాడని, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి, చిన్న ప్యాకెట్లుగా చేసి తిరుపతి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. సమావేశంలో రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

10వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

వెంకటగిరి, జనవరి 12: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారంతో విరమించారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాయం వద్ద మాత్రం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారంతో పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమ్మెను విరమింపజేయడానికి చూడాల్సిన కమిషనర్ కార్మికులను రెచ్చగొట్టేలా మాట్లాడి, కక్ష సాధింపు చర్యలకు దిగినా పాలకులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నాలుగు నెలల వేతనాలను చెల్లించి, కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, కల్లూరి జాన్, మహేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, జనవరి 12: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి శుక్రవారం వైజాగ్‌కు చెందిన అడారి ధన్వికశ్రీ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర రెడ్డికి ఈ మొత్తాన్ని అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది కామేశ్వరరావు తదితరులున్నారు.


పుత్తూరు వార్తలు

స్వామి వివేకానంద ఆదర్శనీయుడు



పుత్తూరు టౌన్, జనవరి 12: స్వామి వివేకానంద ఆదర్శనీయుడని స్కౌట్స్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వివేకానందుడి జయంతి సందర్భంగా పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఉత్సవాలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సదాశివం, స్కౌట్స్, గైడ్స్ వలంటీర్లు జయకుమార్, భువనేశ్వరి, యువశ్రీ, సుప్రియ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జ్యోతిలక్ష్మి

వడమాలపేట, జనవరి 12: ఎస్వీపురానికి చెందిన నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు ఉత్తమ సేవకురాలిగా జ్యోతిలక్ష్మి పురస్కారం అందుకున్నారు. శుక్రవారం భారత ప్రభుత్వం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవంలో జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసిలు ఈమెకు ప్రదానం చేశారు. దీనిపై రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు, సంఘ సభ్యులు నాదముని, శ్రీనివాసులు, మురళి, చిట్టెమ్మ హర్షం వ్యక్తం చేశారు

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు



వడమాలపేట, జనవరి 12: స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేసింది. శుక్రవారం ఉదయం వడమాల వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో 30 మంది పెన్షనర్లకు ఈ సర్టిఫికెట్లు ఇచ్చామని సేవా సంస్థ జనరల్ సెక్రటరీ చెంగల్ రాజు తెలిపారు. ఇంకెవరైనా ఉంటే 98667 08002, 94401 80472 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. మండల వ్యవసాయశాఖాధికారి విజయకుమార్, ఏపీఎన్జీవోస్ పుత్తూరు తాలూకా అసోసియేషన్ ప్రెసిడెంట్ లోకనాథం పాల్గొన్నారు.

బీసీలకు ద్రోహం చేసిన వైసీపీ

జయహో బీసీ సదస్సులో గాలి భానుప్రకాష్



గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న బీసీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 12: బీసీలకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ద్రౌపదీదేవి ఆలయ తోపు వద్ద జయహో టీడీపీ సదస్సును బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాలు, అవకాశాలు వచ్చాయని గుర్తుచేశారు. బీసీలను ఆర్థికంగా ఆదుకునేందుకు టీడీపీ ప్రవేశ పెట్టిన పథకాలకు, నిధులకు కోత విధించి జగన్ సర్కార్ తీరని ద్రోహం చేసిందని వాపోయారు. సంక్షేమ హాస్టళ్ల దుస్థితి చూస్తే జగన్ ప్రభుత్వానికి బీసీ వర్గాలపై ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందని చెప్పారు. వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రజల జీవితాలను రోడ్ల పాలు చేశారన్నారు. భావి తరాలకు మెరుగైన భవిష్యత్తు కోసం వైసీపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అంతకుమునుపు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జయహో బీసీ సదస్సు కన్వీనర్ వెంకటేష్ యాదవ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డాక్టర్ చెన్నూరు సుధాకర్, వన్నెకుల సాధికార కమిటీ కన్వీనర్ మునిరాజా, సదస్సు సభ్యులు ధరణి, నాగభూషణం, మున్సిపల్ మాజీ చైర్మన్లు కరుణాకర్, బీఆర్ యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ గణేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మెరుపుల మహేష్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, కౌన్సిలర్లు కేశవాచ్చారి, రాధా అశోక్, మణెమ్మ, డాక్టర్ బసంతి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు సీఎం శరవణ, మైనార్టీ సెల్ నాయకులు నబీ మస్తాన్, ఖాజాపీర్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వచ్చాక నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పవర్‌లూమ్స్ కార్మికులకు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించి ఆదుకుంటామని భానుప్రకాష్ పునరుద్ఘాటించారు. బీసీలు ఆర్థికంగా ఎదగాలంటే టీడీపీని ఆశీర్వదించాలని, చంద్రబాబుకు మద్దతుగా నిలబడాలని కోరారు. అనంతరం భానుప్రకాష్‌ను బీసీ నేతలు సత్కరించారు.

భోగి మంటల కోసమే జీవో నెంబరు2

అంగన్వాడీలతో కలిసి ప్రతులను దహనం చేసిన సీఐటీయూ



భోగి మంటల్లో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

పుత్తూరు అర్బన్, జనవరి 12: భోగి మంటల్లో కాల్చుకోవడానికే ప్రభుత్వం జీవో నెంబరు2 తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఎద్దేవ చేశారు. శుక్రవారం అంగన్వాడీల సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద భోగి మంటలు వేసి.. అందులో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 2, శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించలేని జగన్ ప్రభుత్వం.. ఎస్మా ప్రయోగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. సమ్మెను అణగదొక్కేందుకు ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ఎదుర్కొనే సత్తా అంగన్వాడీలకు ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన సంఘం కార్యదర్శి నందయ్య, యూనియన్ నాయకులు మునికుమారి, విజయ్ కుమారి, ధనమ్మ, రాధా, పద్మజ, లలిత, అన్నపూర్ణ, మోహనలక్ష్మి, హైమావతి, గంగులమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



తూతూ మంత్రంగా

సామాజిక తనిఖీ సమావేశం

పుత్తూరు టౌన్, జనవరి 12: మండల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. శుక్రవారం మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన ఉపాధి పనులపై పీడీ శ్రీనివాస ప్రసాద్, డీవీవో భాగ్యలక్ష్మి తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలో రూ.6కోట్ల 27 లక్షల ఖర్చుతో మొత్తం 420 పనులను కూలీలు చేశారు.. దీనిపై తనిఖీ చేసిన అధికారులు కేవలం రూ.6వేలను మాత్రమే రికవరీ చేసేందుకు తాఖీదులు ఇచ్చారు. ఉపాధి హామీ పనుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని వీఆర్పీలకు స్పష్టం చేశారు. అక్రమాలు జరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీడీ సరిత, ఏపీఎం భార్గవి పాల్గొన్నారు.

← సమావేశంలో పాల్గొన్న అధికారులు

రేణిగుంట-నంద్యాల మధ్య
ప్యాసింజరు రైలు ప్రారంభం



రేణిగుంటలో ప్యాసింజరు రైలును ప్రారంభిస్తున్న అధికారులు

రేణిగుంట, జనవరి12: దక్షిణ మధ్య రైల్వే అధికారులు రేణిగుంట-నంద్యాల మధ్య ప్రత్యేక ప్యాసింజరు రైలును శుక్రవారం సాయంత్రం 3.50 గంటలకు ప్రారంభించారు. గుంటూరు కేంద్రంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్ విధానంలో దీన్ని ప్రారంభించారు. అనంతరం గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం కె.సూర్యనారాయణ, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణలు పచ్చజెండా ఊపి రేణిగుంటలో ప్రారంభించారు. ఈ రైలు ప్రతిరోజు నంద్యాలలో ఉదయం 5.40 గంటలకు బయలుదేరి కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లి, కోడూరు, బాలపల్లిరైల్వే స్టేషన్ల మీదుగా రేణిగుంటకు మధ్యాహ్నం 12.40 గంటలకు చేరుకొంటుంది. రేణిగుంటలో అదేరోజు 1.45 గంటలకు వచ్చిన మార్గంలోనే తిరిగి నంద్యాలకు రాత్రి9 గంటలకు చేరుకొంటుంది. తిరుపతి పుణ్యక్షేత్రాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల అవసరాల మేరకు రైళ్ల సంఖ్యను పెంచడానికి అధికారులు నంద్యాల -కడప వరకు రోజువారీ రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ప్యాసింజర్లు (07284 -07285)ను రేణిగుంట రైల్వేజంక్షన్ వరకు పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు రైల్వే స్టేషన్ల మధ్య ఇప్పటి వరకు ప్యాసిజరు రైళ్లు లేవు. ఈ రైలు వల్ల తిరుమల- ఒంటిమిట్ట పుణ్యక్షేత్రాల మధ్య భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. ఈ మార్గంలో కోడూరు, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, కడప ప్రధాన రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌లు ఉంటాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు, చిరు వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రేణిగుంటలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారులు అభిరాం, ప్రణయ్‌కుమార్, శేషగిరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కె.సుధాకర్, మధుసూదనరావు, ఎం.సందీప్ కుమార్, ఎస్‌వీ. రావు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు పి.చ్రంశేఖర్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు భరత్‌రెడ్డి, మురళీకృష్ణ, రాధాక్రిష్ణ, బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అముదూరును వీడని వరద నీరు




చెరువు లీకేజీ వల్ల గ్రామంలో వస్తున్న నీరు, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఏర్పేడు, జనవరి 12: అముదూరు గ్రామాన్ని వరద నీరు వీడడం లేదు. అముదూరు చెరువు లీకేజీ నీరు గ్రామంలోని వీధుల్లో ప్రవహిస్తోంది. నీరు నిల్వతో దోమలు వృద్ధిచెంది జనం రోగాల బారినపడుతున్నారు. ఈ క్రమంలో సమస్యను పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు ఎంపీడీవో గిడ్డయ్యకు శుక్రవారం వినతిపత్రం అంద జేశారు. అదేవిధంగా జనసేన ఇన్‌చార్జి కోట వినుత ఎంపీడీవోతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. జనసేన నాయకులు వెంకటరమణయాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి జనవరి 12: దళితుల భూములను ఆన్‌లైన్ చేయాలని శ్రీకాళహస్తి మండల సీపీఐ కార్యదర్శి మించిన శివకుమార్ కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో రైతులు నిరసన ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సీపీఐ పోరాటాలతో మండలంలోని దళితులకు భూమి పంపిణీ చేశారన్నారు. ఆన్‌లైన్ చేయాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా చేయడం లేదని పేర్కొన్నారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి: ముక్కంటి నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం యాదాద్రికి చెందిన కడగంచి యాదయ్య రూ.50వేలు విరాళం ఇచ్చారు. శుక్ర వారం ఏఈఓ సతీష్ మల్లి, పీఆర్‌వో నాగభూషణంనాయక్‌కు నగదు అంద జేశారు.

కోడి పందేలు చట్టవ్యతిరేకం

ఏర్పేడు, జనవరి 12: కోడి పందేలు ఆడటం చట్ట వ్యతిరేకమని, జీవహింస చేయరాదని ఏర్పేడు సీఐ శ్రీహరి సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తు చర్యల్లో భాగంగా గతంలో కోడి పందెం దాడుల్లో పట్టు బడిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జిలానీ, ఏఎస్ఐ జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పనులు వేగవంతం చేయండి

శ్రీకాళహస్తి, జనవరి 12: అనుబంధ ఆలయాల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధమైన పలు ఆలయాల్లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈఈ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా రామయ్య ఆచారి

ఏర్పేడు, జనవరి 12: వైసీపీ నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఏర్పేడు మండలం మర్రిమందకు చెందిన రామయ్య ఆచారి నియమితులయ్యారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు.

చిందేపల్లిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఏర్పేడు, జనవరి 12: చిందేపల్లిలో వెలసిన పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ చారిట బుల్ ట్రస్టు తరపున క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు ఆరు జట్లు తలపడ్డాయి. ఇందులో సీతారాంపేట, శ్రీకాళహస్తి, చిందేపల్లి జట్లు విజయం సాధించాయి. ఈ టోర్నమెంట్‌లో పరిసర గ్రామాల నుంచి 40 జట్ల యువకులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త గిరిధర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఏర్పేడు, జనవరి 12: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముందస్తు చర్యల నిమిత్తం ఏర్పేడు మండలం సీతారాంపేట, అంజిమేడు, పోతుమానుగుంట, ఏర్పేడు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సాయంత్రం రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సీఐ శ్రీహరి, ఎస్ఐ జిలానీ, ఏఎస్ఐ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

వస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, జనవరి 12: శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామికి తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి గ్రామానికి చెందిన విజయ్ భాస్కర్‌రెడ్డి దంపతులు శుక్రవారం ఆలయాన్ని దర్శించుకున్నారు. అంతకు ముందు వస్త్రాలను సమర్పించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 12: బుచ్చినాయుడుకండ్రిగ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పాఠశాల చైర్మన్ కుమార్‌లు శుక్రవారం అందజేశారు.

ఆవు, దూడ సమర్పణ

శ్రీకాళహస్తి, జనవరి 12: స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అర్థనారీశ్వర స్వామి ఆలయానికి ముక్కంటి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆవు,దూడను సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు. గోసంరక్షణ కోసం అర్థనారీశ్వర స్వామి ఆలయం వద్ద షెడ్డు నిర్మిస్తామని చైర్మన్ అంజూర్ శ్రీనివాసులు వెల్లడించారు. ఆలయ ఈఈ నూకరత్నం, ఏఈలు వేణుగోపాల్, పవన్ కుమార్, స్థపతి కుమార్ పాల్గొన్నారు.

వేదనారాయణుడి ఆదాయం రూ.3.5 లక్షలు

నాగలాపురం, జనవరి 12: నాగలాపురంలోని వేదనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో రూ.3లక్షలా 55వేల 345 ఆదాయం వచ్చినట్లు టీటీడీ ఏఈ పార్థసారథి తెలిపారు. ఇవి గత నాలుగు నెలల కాలంలో భక్తులు హుండీలో చెల్లించుకున్న కానుకలని వివరించారు. ఈ లెక్కింపును సూపరింటెండెంట్ రమేష్, ఆలయాధికారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పిచ్చాటూరు, జనవరి 12: పిచ్చాటూరు మండలంలో శనివారం సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బోగస్ ఓట్లు లేకుండా చూడండి

వరదయ్యపాళెం, జనవరి 12: బీఎల్‌వోలు బోగస్ ఓట్లు లేకుండా చూడాలని టీడీపీ పార్ల మెంటరీ అధికార ప్రతినిధి డాక్టర్ నాగరాజు కోరారు. ఆ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతులు ఈకేవైసీ చేసుకోవాలి : ఏవో

సత్యవేడు, జనవరి 12: ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఫిబ్రవరి 15లోగా ఈకేవైసీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సత్యవేడు వ్యవసాయశాఖ ఏవో మురళి కోరారు. మినుములు 33 శాతం రాయితీతో విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి , వెటర్నరీ ఏవో డాక్టర్ దయాకర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

యువశక్తి ఆగ్రహంతో వైసీపీ వినాశనం



కరపత్రానికి అంతిమ యాత్ర చేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 12: యువశక్తి ఆగ్రహంతో వైసీపీ వినాశనం తప్పదని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ధ్వజమెత్తారు. జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని వైసీపీ యువతకు చేసిన మోసాన్ని వివరించేలా శుక్రవారం టీడీపీ నాయకులు నిరసన ర్యాలీ చేశారు. పట్టణంలోని బీపీ అగ్రహారం కూడలి నుంచి బొజ్జల సుధీర్ రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. పెద్ద ఎత్తున యువత, టీడీపీ కార్యకర్తలు హాజరయ్యారు. ముందుగా వైసీపీ ఉద్యోగాల విప్లవం పేరుతో ప్రచారం చేసుకుంటున్న కరపత్రానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. అనంతరం యువత భవిష్యత్తును సమాధి చేశారంటూ ఆ కరపత్రానికి అంతిమ యాత్ర చేశారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ జాబ్ కాలండర్ పేరుతో అధికారంలోకి వచ్చి ఉపాధి లేకుండా చేశారని మండిపడ్డారు. మంచి భవిష్యత్తు కోసం యువత వచ్చే ఎన్ని కల్లో టీడీపీ ఆదరించాలని కోరారు. అనంతరం పాదయాత్రగా నిరసన ర్యాలీ రామసేతు వంతెన, సూపర్ బజార్, నెహ్రూ వీధి, పెళ్లిమండపం, నగిరివీధి, బేరివారి మండపం, బజారు వీధి మీదుగా రాజగోపురం వరకు సాగింది. అక్కడ మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి, రాష్ట్ర కార్యదర్శిరెడ్డి వారి గురువారెడ్డి, పట్టణాధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్ఫూర్తి చిరస్మరణీయం




శ్రీకాళహస్తిలో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న సామాజిక సమరత వేదిక సభ్యులు, బుచ్చినాయుడు కండ్రిగలో పూర్వ విద్యార్థుల నివాళి

శ్రీకాళహస్తి, జనవరి 12: స్వామి వివేకానంద చూపిన స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయమని సామాజిక సమరత వేదిక అధ్యక్షులు పసల వీరస్వామి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు బత్తినయ్య, బాలసుబ్రమణ్యం, సురేష్ మంగిరెడ్డి, హిమవతి, ఈశ్వరయ్య శ్రీనివాస్, శంకరయ్య, రమేష్ బాబు, రంగయ్య, మహేష్ శర్మ పాల్గొన్నారు. ● ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి వందనం చేశారు. అధ్యాపకులు నరసింహులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం కృష్ణ అసోసియేట్స్ కార్యాలయంలో చేనేత కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గుత్తి త్యాగరాజు, కార్యదర్శి వెంకటరమణ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు మునస్వామి, కృష్ణమూర్తి, శేఖరయ్య, వెంకటరాములు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్వామి వివేకానంద యువతరానికి చైతన్యమూర్తి అని తెలుగుభాషా పండితులు యువశ్రీ మురళి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని వివేకానందుడి విగ్రహానికి పూర్వ విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు షణ్ముగం, సురేష్, శేఖర్, ఉషారాణి, సురేంద్ర, శారద, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, మునికుమార్, చెంగయ్య పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట ఆషా స్వచ్ఛంద సేవా కార్యాలయంలో నాయకులు, అభిమానులు వివేకానందుడికి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జూలియస్‌రాజు, రవి, కో-ఆప్షన్ సభ్యులు అసన్ సాహెబ్, అమ్ములు రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో పునర్జన్మ




రక్తదానం చేస్తున్న ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, వివేకానందుడికి స్కౌట్ విద్యార్థుల నివాళి

శ్రీకాళహస్తి, జనవరి 12: ఒకరి రక్తదానంతో ముగ్గురికి పునర్జన్మ లభిస్తుందని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద పురపాలక సంఘం, మెప్మా, యువతరం సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆర్డీవో రవిశంకర్ రెడ్డి రక్తదానం చేసి శిబిరం ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా దాతలు రక్తం ఇచ్చినట్లు వెల్లడించారు. దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ప్రసాద్, విశ్రాంత ఉద్యోగి స్వర్ణ మూర్తి, న్యాయవాదులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, ఎన్టీఆర్ ట్రస్టు వైద్య బృందం, యువతరం సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ● స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో స్కౌట్ విద్యార్థులు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులు తెలిపారు. ● పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వివేకానందుడి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మధ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణ, జిల్లా అధికార ప్రతినిధి రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, నాయకులు ప్రతాప్ మోహన్‌రావు వాసు, డిల్లీ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె ఉధృతం

శ్రీకాళహస్తి, జనవరి 12: న్యాయమే అంతిమంగా గెలుస్తుందని అంగన్వాడీలు అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద 32వ రోజు శుక్రవారం ఒంటి కాలిపై నిరసనతో నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు భారతి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడులో సమ్మెను నిర్వహిస్తున్న అంగన్వాడీలు సమ్మెలో భాగంగా శుక్రవారం సర్వమత ప్రార్థనలు చేశారు. సీఎం జగన్‌కి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, డీవైఎఫ్ఐ మురళి, అంగన్వాడీ కార్యకర్తలు నిర్మల, భువన, సరళ, శాంతి, ఝాన్సీ, కాంతమ్మ, భారతి, నాగరాజు, మంజుల, చెందామర్రై, విజయ, పార్వతి, అనురాధ, సుజాత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: అన్న అని ఆదరిస్తే అందలమెక్కాక అంగన్వాడీల నోట్లో మట్టి కొట్టిన సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో మట్టికొట్టుకుపోవడం ఖాయమని పిచ్చాటూరులో అంగన్వాడీలు శాపనార్థాలు పెట్టారు. ప్లేట్లలో మట్టి పోసుకుని జీతాలు పెంచ కుంటే అన్నం బదులు మట్టి తిని బతకాల్సిన పరిస్థితి ఉందని నిరసన తెలియజేస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇందిర, రాజేశ్వరి, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.





శ్రీకాళహస్తిలో ఒంటి కాలిపై నిలుచుని, సత్యవేడులో సర్వమత ప్రార్థనలతో, పిచ్చాటూరులో మట్టి తినాల్సిందేనంటున్న అంగన్వాడీలు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాసులు

రేణిగుంట, జనవరి12: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి సాధించుకోవచ్చని రాస్ కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు వెల్లడించారు. రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో ఉన్న రాస్ కేవీకేలో శుక్రవారం నింద్ర, కేవీబీపురం, పిచ్చాటూరు, వెదురుకుప్పం మండలాల రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలను వివరించారు. మల్బరీ పంటలు సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. ప్రధానంగా సేంద్రియ ఎరువులతో నేలను ఆరోగ్యవంతంగా చేసుకోవాలన్నారు. పంటలను చీడ, పీడల నుంచి కషాయాలతో కాపాడుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్ర వేత్తలు పద్మజ, సుధాకర్, దివ్య, రాముకుమార్‌లు రైతులకు ప్రకృతి వ్యవసాయంలో తీసుకో వలసిన మెళకువలను వివరించారు.

ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్‌కుమార్

రేణిగుంట, జనవరి12: రైలు ప్రయాణికుల భద్రతతో పాటు ఆస్తుల పరిరక్షణ పట్ల ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని రైల్వే భద్రతా దళాల అధికారి ఎం. సందీప్‌కుమార్ వెల్లడించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో రైల్వే సంస్థలో వున్న అన్నిశాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తిరుపతి పుణ్యక్షేత్రానికి వేలాది మంది భక్తులు రైళ్లలో వస్తారన్నారు. వారికి ఎలాంటి అభద్రతా భావాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అన్నిశాఖల అధికారులు సమష్టిగా పరస్పర సహకారం అందించుకోవాలన్నారు. ప్రధానంగా రైళ్లలో చోరీలు జరగకుండా చర్యలు తీసుకో వాలన్నారు. అనుమానం కలిగిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శేషగిరినాథరెడ్డి, మురళీకృష్ణ, బీసీవీ.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చెరువులో 25వేల చేప పిల్లలు విడుదల

నాగలాపురం, జనవరి 12: నాగలాపురంలోని ఎర్ర చెరువులో శుక్రవారం తిరుపతి జిల్లా మత్స్య శాఖ ఏడీ రాజేష్ 25వేలు చేప పిల్లలను వదిలారు. ఆయన మాట్లాడుతూ మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం రాయితీతో ఈ చేప పిల్లలను వదిలామన్నారు. మత్స్య కారుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం కోసం ప్రతి ఏటా ఈ చేప పిల్లలను చెరువులోకి వదులుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ సుధా చిన్నదురై, ఎంపీపీ సింధూశ్యాం, మత్స్యకారులు పాల్గొన్నారు.

బొమ్మసముద్రం రైల్వే స్టేషన్ వద్ద గేటు ఏర్పాటు చేయండి



రేణిగుంట, జనవరి12: తిరుపతి -కాట్పాడి రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న బొమ్మసముద్రం రైల్వే స్టేషన్ యార్డ్‌లో గ్రామస్తుల అవసరాల మేరకు రైల్వే గేటు ఏర్పాటు చేయాలని దక్షిణమధ్య రైల్వే ఏడీ ఆర్ఎం సూర్య నారాయణకు బొమ్మగుంట గ్రామస్తులు, గుండాల గోపీనాథరెడ్డి వినతిపత్రం అందించారు. గతంలో గేటు ఉండేదని అభివృద్ధి పనుల్లో భాగంగా గేటు తొలగించారని దీనివల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో దండాల రాజశేఖర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, టి.సుబ్రమణ్యంరెడ్డి ఉన్నారు.